# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 327, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శనివారం - 08 - ఫిబ్రవరి - 2025


### ఓవరాక్షన్ చేయొద్దు... హైకోర్టు న్యాయవాదికి

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజగోపాల్ నగర్‌లో పర్యటించిన రంగనాథ్

బాధితుల సమస్యలు వింటుండగా జోక్యం చేసుకున్న హైకోర్టు న్యాయవాది ముఖీం

మీరు ఓవరాక్షన్ చేయవద్దని హైడ్రా కమిషనర్ హెచ్చరిక




హైదరాబాద్: ప్లాట్ల విషయంలో కొనుగోలుదారులను కొందరు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటామని, అదే సమయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రంగనాథ్ ఈరోజు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో గల రాజగోపాల్ మిగతా..2లో

## 2027లో చంద్రయాన్-4

2026లో సముద్రయాన్

కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: చంద్రుడిపై శిలలను సేకరించి భూమిపైకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన చంద్రయాన్%-%4 మిషన్‌ను 2027లో చేపట్టనున్నట్లు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. మిషన్‌లో భాగంగా రెండు వేర్వేరు ప్రయోగాలుంటాయన్నారు. ఎల్‌వీఎం%-%3 రాకెట్ ద్వారా ఐదు రకాల సాంకేతిక వస్తు సామాగ్రిని కక్ష్యలోకి పంపి, అక్కడే వాటిని అసెంబుల్ చేయిస్తారని వివరించారు. వచ్చే ఏడాది గగన్‌యాన్ మిషన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన అంతరిక్ష నౌకలో ఇద్దరు భారత వ్యోమగాములను దిగువ భూకక్ష్యలోకి పంపి, తిరిగి సురక్షితంగా మిగతా..2లో

### ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 28న బడ్జెట్!




ఈసారి 15 రోజుల పాటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

తొలి రోజున ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

ఈ నెల 27న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ

2

### 12 వరకు కేటీఆర్ అరెస్టు వద్దు



మహదేవ్‌పూర్ పోలీసులకు హైకోర్టు ఆదేశం

'మేడిగడ్డ'పై డ్రోన్ ఎగరేసిన కేసులో ఊరట

2

### ప్రధాని మోడీని కలిసిన నాగార్జున కుటుంబం..



ఏఎన్ఆర్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించిన మహానటుడు

ఆయన చేసిన చిత్రాలు తెలుగు సినిమా ప్రత్యేకతను ప్రపంచానికి చాటించాయి



### అందుకే వదిలేశా..

**జగన్‌కు విజయసాయిరెడ్డి కౌంటర్**

- "వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్నవాడిని కాబట్టే, ఎవరికీ ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు
- భయం అనేది నాలో ఏ అణువు అణువులోనూ లేదు కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవులతో పాటు రాజకీయాలనే వదులుకున్నా"

2లో




### ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం!

- భారత బ్యాంకుల వెబ్ డొమైన్ ఇక బ్యాంక్.ఇన్
- నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలకైతే ఫిన్.ఇన్ డొమైన్
- ఏప్రిల్ నుంచి బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నమ్మకాన్ని పెంచే ఉద్దేశంతోనే ఈ నిర్ణయమన్న ఆర్‌బీఐ గవర్నర్

2లో



### కుంభమేళాలో పాక్ హిందువులు...

- యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా
- దేశ విదేశాల నుంచి క్యూ కడుతున్న భక్తులు
- పాకిస్థాన్ నుంచి కుంభమేళాకు వచ్చిన 68 మంది హిందువులు
- హిందు మతం గొప్పతనాన్ని మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం దక్కిందని వ్యాఖ్య



ఏపీలో ఉగాది నుంచి

## పి-4 విధానం అమలు

పి-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్) విధానం అమలుకు చర్యలు

పి-4 విధానంపై అధికారులతో సీఎస్ సమీక్ష

పేదరిక నిర్మూలనే లక్ష్యమని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ : ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఉగాది నుండి పి-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్స్) విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వెల్లడించారు. పి-4 విధానంపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులు, వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4 విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పి-4 విధానం ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విధి విధానాల రూపకల్పనకు ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించడంతో పాటు ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొందిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. మిగతా..2లో

## మంత్రులకు ర్యాంకులు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు

మంత్రులకు ర్యాంకులు ప్రకటించిన సీఎం చంద్రబాబు

ప్రథమ స్థానంలో ఫరూఖ్.. చివరిస్థానంలో వాసంశెట్టి సుభాష్

చంద్రబాబుకు 6వ ర్యాంకు

తాను కూడా మెరుగుపడాల్సి ఉందని అంగీకరించిన చంద్రబాబు



అమరావతి: ఏపీ మంత్రుల పనితీరు ఆధారంగా నిన్న సీఎం చంద్రబాబు ర్యాంకింగ్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో సీఎం చంద్రబాబుకు 6వ స్థానం లభించింది. ఈ క్రమంలో నేడు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రులకు దిశానిర్దేశం చేశారు. తాను కూడా మెరుగుపడాల్సి ఉందని నిజాయతీగా అంగీకరించారు. ఈ ర్యాంకులు విడుదల చేసింది ఒకరు గొప్ప, మరొకరు తక్కువ అనే ఉద్దేశంతో కాదని స్పష్టం చేశారు. "ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారు. వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నాం. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే... మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. మిగతా..2లో

## భారీ బహిరంగ సభలకు ప్లాన్...!

### రాహుల్, ఖార్గేలతో భారీ సభలకు కాంగ్రెస్ ప్లాన్..!

చేసిన పని చెప్పుకుందాం..

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపిన విషయం ప్రజలకు చేరవేసేలా కాంగ్రెస్ అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం

ఏక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం

దేశంలోనే వర్గీకరణ అమలుచేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం



హైదరాబాద్: ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు అధ్యయనం కోసం అక్టోబర్ 11న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్‌ను నియమించింది తెలంగాణ సర్కార్. ఎక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మూడు దశాబ్దాల వర్గీకరణ పోరాటానికి ముగింపు పలుకుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటన కూడా చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర కుల సర్వే నిర్వహించి, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ)లో ఉప వర్గీకరణను అమలు చేసేందుకు చారిత్రాత్మక చొరవ తీసుకున్నందుకు కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ అభినందించింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపిన విషయం ప్రజలకు చేరవేసేలా కాంగ్రెస్ అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఎస్సీ వర్గీకరణపై మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక రూపొందించింది. ఏక సభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మూడు గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణ చేస్తూ.. కేబినెట్ సబ్ కమిటీ, ఏకసభ్య కమిషన్ ఇచ్చిన ప్రతిపాదనలకు సభ్యులంతా మద్దతు తెలిపారు. గ్రూప్-1లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగాల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చారు. వారికి ఒక శాతం రిజర్వేషన్ ప్రతిపాదించారు. గ్రూప్-2లో మాదిగలతో పాటు 18 ఉపకులాలను చేర్చారు. మిగతా..2లో



### మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

భేటీలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్

పీసీసీ కార్యవర్గంపై చర్చించిన నేతలు

గజ్వేల్‌లో నిర్వహించబోయే ఎస్సీ వర్గీకరణ సభకు ఖర్గేకు ఆహ్వానం

ఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కులగణన, ఎస్సీ వర్గీకరణపై సీఎం వివరించారు. ఈ అంశాలపై నిర్వహించే సభలకు రావాలని ఖర్గేను ఆహ్వానించారు.ఎస్సీ వర్గీకరణ, కుల గణన అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వెల్లడించారు. సూర్యాపేటలో ఈ నెలలో నిర్వహించనున్న బీసీ కుల గణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, మిగతా..2లో

## 9,700 మంది యూఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు!

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ ఎయిడ్) సిబ్బందిలో 9,700 మందిని ఇంటికి పంపాలని నిర్ణయించారు. ఈ సంస్థలో మొత్తం 10 వేల మంది ఉండగా, ఆ సంఖ్యను 300 కంటే తక్కువకు కుదించాలని నిర్ణయించారు. ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆఫ్రికా బ్యూరోలో 12 మందిని, ఆసియా బ్యూరోలో 8 మంది సహా మొత్తం 294 మందిని మాత్రం ఉంచి మిగతా ఉద్యోగులను తొలగించాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా నేరుగా నియమించిన యూఎస్ ఎయిడ్ ఉద్యోగులందరినీ సెలవులో పంపబోతున్నట్టు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అలాగే, విదేశాల్లో పనిచేస్తున్న వేలాదిమందిని వెనక్కి పిలిపించింది. ప్రభుత్వ నిర్ణయంతో వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోనున్నాయన్న ఆందోళన కనిపిస్తోంది. ఇప్పటికే కొందరికి తొలగింపు నోటీసులు అందినట్టు తెలిసింది. యూఎస్ ఎయిడ్ అనేది మానవతా సహాయ సంస్థ. ఇది 2023లో 130 దేశాల్లో సాయం అందించింది. ఇది సాయం అందించిన దేశాలు చాలా వరకు అంతర్యుద్ధాలు, నిత్య సంఘర్షణలతో ఛిన్నాభిన్నమవుతూ తీవ్ర పేదరికంలో ఉన్నవే. సీఆర్ఎస్ నివేదిక ప్రకారం.. యూఎస్ ఎయిడ్ సాయం అందుకున్న వాటిలో ఉక్రెయిన్, ఇథియోపియా, జోర్డాన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సోమాలియా, యెమెన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలున్నాయి.

## కుంభమేళాలో పాక్ హిందువులు...

యూపీ: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు క్యూ కడుతున్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తాజాగా ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు దాయాది పాకిస్థాన్ నుంచి 68 మంది హిందువులు కూడా ప్రయాగ్‌రాజ్ వచ్చారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడి ఘాట్‌లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాము సింధ్ ప్రావిన్స్ నుంచి వచ్చామని చెప్పారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ పవిత్ర సందర్భాన్ని మిస్ చేసుకోకూడదనే ఉద్దేశంతో ఇండియాకు వచ్చినట్లు తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమం ద్వారా హిందు మతం గొప్పతనాన్ని తొలిసారిగా మరింత లోతుగా అర్థం చేసుకునే అవకాశం దక్కిందన్నారు. హరిద్వార్ వెళ్లి తమ పూర్వీకుల అస్థికల్ని గంగలో కలిపామని వారు చెప్పారు. ఈ ఫీలింగ్ చాలా అద్భుతంగా ఉందంటూ పాక్ హిందువులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, గత నెల 13న ప్రారంభమైన మహా కుంభమేళా ఈ నెల 26 వరకు జరగనుంది. 45 రోజుల పాటు జరిగే కుంభమేళాకు దాదాపు 40 కోట్ల మంది వరకు భక్తులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఇప్పటికే 30 కోట్లకు పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది.

## ఎల్జీ ఆదేశం.. ఆప్ నేతల ఇళ్లకు ఏసీబీ

న్యూఢిల్లీ: తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే క్రమంలో ఒక్కొక్కరికీ రూ. 15 కోట్లు చొప్పున బీజేపీ ఆఫర్ చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ఒక రోజు ముందు కేజ్రీవాల్..బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ సిద్ధమైందని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. దీనిపై చట్టపరమైన చర్యలకు తీసుకుంటామని హెచ్చరించిన బీజేపీ.. ఇందులో భాగంగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాసింది. ఆప్ ఆరోపణలపై నిగ్గు తేల్చాలని బీజేపీ కోరింది. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని లేఖ ద్వారా ఎల్జీని కోరింది. దీనిపై స్పందించిన ఎల్జీ.. ఏసీబీ దర్యాప్తుకు ఆదేశించారు. ఎల్జీ ఆదేశాలతో దర్యాప్తుకు సిద్ధమైన ఏసీబీ .. ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇంటితోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేల ఇళ్లల్లో సోదాలు ప్రారంభించింది. దీనిలో ఏసీబీకి చెందిన బృందాలు ఆప్ నేతల ఇళ్లలో సోదాలు చేయడానికి సిద్ధమయ్యాయి. అయితే దీనిపై ఆప్ నేత సంజయ్ సింగ్ మండిపడుతున్నారు. ఏసీబీ డ్రామా ఏంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. చర్యలు తీసుకోవడానికి బదులు సరికొత్త డ్రామాకు తెరలేపారన్నారు. దర్యాప్తులో అన్ని విషయాలు బయటపడతాయని ఆయన అన్నారు. కాగా, ఆప్ నేతలు బీజేపీలో చేరితే మంత్రి పదవి ఇస్తామని, రూ.15 కోట్ల చొప్పున ఇస్తామని ఆఫర్ చేశారన్న కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ట్విట్టర్ వేదికగా కేజ్రీవాల్..'గత రెండు గంటల్లోనే మా పార్టీకి చెందిన 16 మంది అభ్యర్థులకు ఫోన్లు వచ్చాయి. ఆప్‌ను వీడి బీజేపీ చేరితే మంత్రి పదవి ఇస్తామని, రూ.15 కోట్ల చొప్పున ఇస్తామని ఆఫర్ చేశారు. ఆ పార్టీకే 55కుపైగా సీట్లు వస్తుంటే.. మా అభ్యర్థులకు ఫోన్లు చేయాల్సిన అవసరం ఏముంది? దీన్నిబట్టి చూస్తే.. నకిలీ సర్వేలు నిర్వహించారని స్పష్టమవుతోంది. కొంతమంది అభ్యర్థులను లాక్కునే ఉద్దేశంతోనే ఇటువంటి వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఏదేమైనా మావాళ్లు ఒక్కరూ అమ్ముడుపోరు' అని చెప్పుకొచ్చారు. అయితే కేజ్రీవాల్ తన వ్యాఖ్యలను రుజువు చేయలేకపోతే క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## 12 వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ఈ నెల 12 వరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావును అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ట్రయల్ కోర్టులో హాజరు నుంచి కూడా మినహాయింపు ఇచ్చింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ కేటీఆర్‌తోపాటు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌లకు ఊరటనిచ్చింది. కేసులో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. గతేడాది జూలై 26న మేడిగడ్డ బరాజ్‌ను సందర్శించిన కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్.. ఎటువంటి సమా చారం, అనుమతి లేకుండా డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరించారంటూ మేడిగడ్డ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యా దు చేశారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తప్పు చేయకున్నా తప్పుడు కేసు పెట్టారని.. విచారణ సహా తదుపరి చర్యలు నిలిపివేయడంతోపాటు ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ కేటీఆర్, వెంకటరమణారెడ్డి, సుమన్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలిచ్చారు.

## ప్రధాని మోడీని కలిసిన నాగార్జున కుటుంబం..

హైదరాబాద్: టాలీవుడ్ స్టార్ హీరో అక్కినేని నాగార్జున ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పార్లమెంట్ హౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు 100వ జయంతిని పురస్కరించుకుని "మహాన్ అభినేత అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ" అనే గ్రంథాన్ని ప్రధాని మోదీకి అందించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత, పద్మభూషణ అవార్డు గ్రహీత, మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించారు. ఆయన విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ అక్కినేని నాగేశ్వరరావు సమగ్ర కృషిని, భారతీయ సినీ రంగానికి చేసిన విశేష సేవలను కొనియాడారు. ప్రత్యేకించి, తెలుగు సినీ పరిశ్రమను చెన్నై నుండి హైదరాబాద్కు మళ్లించి.. ప్రస్తుతం అభివృద్ధి చెందే స్థాయికి తీసుకువెళ్లడంలో ఏఎన్ ఆర్ పాత్ర అపూర్వమైనదని కొనియాడారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఏఎన్ఆర్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెరపై అద్భుతంగా ఆవిష్కరించిన మహానటుడు అని పేర్కొన్నారు. ఆయన చేసిన చిత్రాలు తెలుగు సినిమా ప్రత్యేకతను ప్రపంచానికి చాటించాయని ప్రశంసించారు. 117వ "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ ఏఎన్ఆర్ గురించి ప్రస్తావించిన విషయాన్ని నాగార్జునతో పంచుకున్నారు. ఏఎన్ఆర్ తో పాటు, టపన్ సిన్హా, రాజ్ కపూర్ లాంటి భారతీయ సినిమా దిగ్గజాలను తన ప్రసంగంలో గుర్తుచేసినట్లు తెలిపారు. ఏఎన్ఆర్ కేవలం నటుడే కాకుండా, విద్య, సాహిత్యం, సేవారంగాల్లోనూ ఎనలేని కృషి చేశారు అని మోదీ ప్రశంసించారు. ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి తెలుగు చిత్రపరిశ్రమకు బలమైన మద్దతునిచ్చారని, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల (గుడివాడ) వంటి విద్యాసంస్థల స్థాపన ద్వారా విద్యాభివృద్ధికి దోహదపడ్డారని గుర్తు చేశారు. ఏడు దశాబ్దాల సినీ ప్రస్థానంలో ఏఎన్ఆర్ ఎన్నో అద్భుతమైన పాత్రలు పోషించి, సినీ ప్రేమికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మోదీ వ్యాఖ్యానించారు. "నేను నా జీవితం", "మనసులోని మాట" వంటి రచనల ద్వారా ఆయన జీవన సత్యాలను విశ్లేషించారని అభిప్రాయపడ్డారు. ఏఎన్ఆర్ భారతీయ సినిమాకు అంకితభావంతో పనిచేసిన మహానుభావుడు మాత్రమే కాకుండా, భారతీయ కళా, సాహిత్య సంప్రదాయాలకు గౌరవం తీసుకువెళ్లిన మేధావి అని ప్రధాని కొనియాడారు.

## అందుకే వదిలేశా..
## జగన్‌కు విజయసాయిరెడ్డి కౌంటర్



అమరావతి: విమాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్నవాడిని కాబట్టే, ఎవరికీ ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు అణువులోనూ లేదు కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవులతో పాటు రాజకీయాలనే వదులుకున్నా" అంటూ ట్వీట్ చేశారు మాజీ ఎంపీ. (గురువారం) జగన్ ప్రెస్మీట్లో క్యారెక్టర్, విలువలపై పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై సాయి రెడ్డి కౌంటర్ ఇస్తూ.. విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్నవాడిని కాబట్టే ఎవరికీ ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదని అన్నారు. ఈ మేరకు ఎక్స్లో పోస్టు చేశారు మాజీ ఎంపీ. ఇప్పుడు సాయిరెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాగా.. నిన్నటి ప్రెస్‌మీట్‌లో విజసాయిరెడ్డి గురించి ప్రస్తావించారు జగన్. విజయసాయిరెడ్డి పార్టీ నుంచి రాజీనామా చేసి పార్టీ పదవులకు, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి వెళ్లిపోవడంపై మీడియా అడిగిన ప్రశ్నలకు జగన్ స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులకు విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉండాలని అటువంటప్పుడే అతడిని నాయకుడిగా ఎదుటివాళ్లు చూపిస్తారని, కాలర్ ఎగరేసుకుని తిరగడానికి కూడా వీలుంటుందని అన్నారు. అలాగే సాయిరెడ్డితో పాటు పార్టీ నుంచి వెళ్లి పోయిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు విషయంలో ఎవరికైనా ఇదే వర్తిస్తుంది అని చెప్పారు. ఒక ఎంపీని, ఎమ్మెల్యేను చూస్తే వీళ్లు నాయకులు, లీడర్లు అనే క్రెడిబులిటీ రావాలని జగన్ పేర్కొన్నారు. ఈ క్రమంలో తనకు వ్యతిరేకంగా జగన్ ఇచ్చిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు మాజీ ఎంపీ. జగన్ చెప్పిన విలువలు, విశ్వసనీయత అనే వ్యాఖ్యలనే ఆధారంగా చేసుకుని విజయసాయి స్ట్రాంగ్‌గా కౌంటర్ ఇచ్చారు. భయం లేదు కాబట్టే అన్ని పదవులను వదులుకున్నట్లు తెలిపారు. అయితే ఈ కౌంటర్‌తో విజయసాయి, జగన్‌కు మధ్య యుద్ధం మొదలైనట్లు చెప్పుకోవచ్చు. సాధారణంగా జగన్ వ్యాఖ్యలకు ఎప్పుడూ కూడా కౌంటర్ ఇవ్వని విజయసాయిరెడ్డి తొలిసారిగా గట్టిగానే కౌంటర్ ఇవ్వడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

# మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

మొదటి పేజి తరువాయి

ఖర్గేను ఆహ్వానించారు.ఎస్సీ వర్గీకరణ, కుల గణన అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వెల్లడించారు. సూర్యాపేటలో ఈ నెలలో నిర్వహించనున్న బీసీ కుల గణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు రావాలని ఖర్గేను ముఖ్యమంత్రి కోరారు. కాగా, నిన్న (గురువారం) హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ఆర్డీ)లో కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. సుమారు ఐదుగంటల పాటు కొనసాగిన ఈ సమావేశంలో సీఎంతోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, కులగణన, ఎస్సీ వర్గీకరణ, ఎమ్మెల్యేల ప్రత్యేక సమావేశాలు తదితర అంశాలపై చర్చించారు. సూర్యాపేటలో కులగణన సభకు రాహుల్ గాంధీని, మెదక్ ఎస్సీ వర్గీకరణ సభకు ఖర్గేను ఆహ్వానిస్తామని తెలిపారు. ఇక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా వ్యయం చేస్తున్న అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నెన్ని నిధులిచ్చారనే అంశాన్ని కూడా భట్టి ఇందులో వివరించినట్టు సమాచారం.

# 2027లో చంద్రయాన్-4

మొదటి పేజి తరువాయిఈ



ఏడాదిలో గగన్‌యాన్ మానవరహిత మిషన్ లో భాగంగా వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపిస్తామన్నారు. దీంతోపాటు, 2026లో సముద్రయాన్‌లో భాగంగా ముగ్గురు శాస్త్రవేత్తలను 6 వేల మీటర్ల లోతులో సముద్రం అడుగు భాగానికి పంపిస్తామని వెల్లడించారు. వీరు సముద్రగర్భంలో వనరులు, కీలక, అరుదైన ఖనిజాల అన్వేషణతోపాటు, సముద్ర జీవజాలంపై పరిశోధనలు జరుపుతారని చెప్పారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 1969లో అవతరించగా మొదటి లాంచ్ ప్యాడ్ రెండు దశాబ్దాల అనంతరం 1993లో కార్యరూపం దాల్చిందని చెప్పారు. మరో దశాబ్ద కాలం తర్వాత 2004లో రెండో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించామన్నారు. విస్తరణ, మౌలిక వనరుల కల్పన, పెట్టుబడుల విషయంలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. భారత అంతరిక్ష ఆర్థిక రంగ ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని వివరించారు. దీనిని వచ్చే పదేళ్లలో 44 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లి, ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్ స్థానాన్ని సుస్థిరం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

# భారీ బహిరంగ సభలకు ప్లాన్...!

మొదటి పేజి తరువాయి



అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌కు తెలంగాణ శాసనసభ, శాసన మండలి ఆమోదం తెలిపాయి. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని.. దేశంలోనే వర్గీకరణ అమలుచేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించిన ఏకసభ్య కమిషన్ వర్గీకరణ చేయాలని సిఫారసు చేసిందని అన్నారు. అమలుపై ప్రతిపాదనలు చేస్తున్నానని వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ భేటీకి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వేపై మీటింగ్‌లో ఆరు గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. కులగణన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కులగణన చట్టబద్దం అయినా కాకపోయినా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు బీసీలకు కేటాయించే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. పార్టీలో చేరిన వారితో కలిసి పని చేయాలన్నారు. రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల విషయంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృతి చేయాలన్నారు. ఈ పథకాలకు లబ్దిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు సీఎం రేవంత్. అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనన్ని గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని ప్రజాప్రతినిధులకు మార్గనిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే ప్రజలకు చేస్తున్న మంచి పనులను క్షేత్రస్థాయిలో తీసుకువెళ్ళేలా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఫిబ్రవరి నెలలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించేలా ప్లాన్ చేస్తోంది. రాష్ట్రంలో నిర్వహించే సభలకు అధినాయకత్వాన్ని కూడా ఆహ్వానిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై మెదక్ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని.. ఈ బహిరంగ సభకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తామన్నారు. అలాగే, సూర్యాపేటలో బీసీ బహిరంగ సభకు రాహుల్ గాంధీని తీసుకువస్తామని టీపీసీసీ చీఫ్ తెలిపారు. న్యూఢిల్లీలోని పార్టీ నాయకత్వాన్ని సంప్రదించిన తర్వాత వేదికలు, తేదీలను నిర్ణయిస్తామన్నారు. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన మార్పును అణగారిన వర్గాలకు వివరించడానికి ఇది ఒక అవకాశమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. ఇదిలావుంటే, తెలంగాణ 1997 నుండి ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ ఉంది. 1997లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ , షెడ్యూల్డ్ కులాలలోని మాదిగ, దాని ఉప కులాలకు మరిన్ని ప్రయోజనాలను కోరుతూ ఉద్యమానికి నాయకత్వం వహించారు. అప్పటి నుండి తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ డిమాండ్ పెరుగుతూ వచ్చింది.

# ఓవరాక్షన్ చేయొద్దు...

మొదటి పేజి తరువాయి



రంగనాథ్ ఈరోజు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో గల రాజగోపాల్ నగర్‌లో పర్యటించారు. తమ ప్లాట్లను కొంతమంది కబ్జా చేస్తున్నారంటూ రాజగోపాల్ నగర్ ప్లాట్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఐలాపూర్‌లో పర్యటించిన రంగనాథ్ బాధితుల సమస్యలను విన్నారు.

ఇరువురి మధ్య వాదన

రాజగోపాల్ నగర్ అసోసియేషన్ సభ్యులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. రంగనాథ్ బాధితుల సమస్యలు వింటున్న సమయంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకున్నారు. న్యాయవాది ముఖీం, 'మీకు తెలుగు వచ్చా' అని హైడ్రా కమిషనర్‌ను అడిగారు. కోర్టు పరిధిలో ఉన్న దానిని చూసేందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఓవర్ యాక్షన్ చేయవద్దని న్యాయవాదిని రంగనాథ్ హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.

వారిని ముందు పెట్టి కబ్జా చేశారనే ఆరోపణ: రంగనాథ్

రాజగోపాల్ నగర్‌లో 40 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ కొంతమంది వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ముందు పెట్టి ముఖీం అనే న్యాయవాది దీనిని కబ్జా చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. కానీ 1980లలో ప్లాట్లు కొన్న వారిలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదవారు ఉన్నారని రంగనాథ్ వెల్లడించారు. కరోనా సమయంలో తాము కట్టుకున్న ఇళ్లను కూలగొట్టారని బాధితులు ఆరోపించారని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి తాము ఇక్కడకు వచ్చామన్నారు.

## ఆర్థిక మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం!

ఢిల్లీ: పెరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. భారత బ్యాంకుల వెబ్ డొమైన్ ఇక నుంచి బ్యాంక్.ఇన్ కలిగి ఉండాలని, అలాగే నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలకైతే ఫిన్.ఇన్ డొమైన్ ఉండాలని సూచించింది. డిజిటల్ చెల్లింపుల్లో మోసాలు పెరుగుతున్న వేళ... బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై నమ్మకాన్ని పెంచే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఇందులో భాగంగానే బ్యాంకు డొమైన్లు ప్రత్యేకంగా ఉండాలన్న ఉద్దేశంతో బ్యాంక్.ఇన్ ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బ్యాంక్.ఇన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆ తర్వాత ఫిన్.ఇన్ రిజిస్ట్రేషన్లు స్వీకరించనున్నట్లు గవర్నర్ చెప్పారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (ఐడీఆర్‌బీటీ) దీనికి రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తుంది. అలాగే దేశంలో జారీ అయిన కార్డుల ద్వారా ఇతర దేశాలలో జరిగే లావాదేవీలకు అడిషనల్ ఫ్యాక్టర్ ఆఫ్ అథెంటికేషన్ (ఏఎఫ్ఏ)ను జోడించనున్నట్లు కూడా గవర్నర్ తెలిపారు. ఇతర దేశాల్లో మర్చంట్ ఉన్నప్పుడు సురక్షిత లావాదేవీలు నిర్వహించడానికి ఈ పద్ధతిని తీసుకొస్తున్నట్లు చెప్పారు.

## రతన్ టాటా వీలునామాలో.. రహస్య వ్యక్తికి రూ. 500 కోట్లు!

ఢిల్లీ: దేశం గర్వించదగ్గ ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా ఇటీవల కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతితో యావత్ దేశం కంటతడి పెట్టింది. గొప్ప మానవతామూర్తిగా, సమాజ సేవకుడిగా పేరుగాంచిన రతన్ టాటా తనకున్న వేల కోట్ల ఆస్తిని సోదరుడు జిమ్మీ టాటాకు, తన వద్ద పని చేస్తున్న వారికి, పెంపుడు శునకాలకు కూడా వీలునామా రాశారు. తాజాగా బయటకు వచ్చిన ఆయన వీలునామా చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఒక రహస్య వ్యక్తికి తన ఆస్తిలో రూ. 500 కోట్లు ఇవ్వాలని వీలునామాలో ఆయన పేర్కొన్నట్టు సమాచారం. జంషెడ్ పూర్ కు చెందిన ట్రావెల్స్ వ్యాపారి మోహన్ దత్తానే ఆ రహస్య వ్యక్తి అని మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. టాటా వద్ద ఆరు దశాబ్దాలకు పైగా మోహన్ దత్తా నమ్మకంగా పని చేశారు. దత్తాకు చెందిన 'స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీ' 2013 నుంచి తాజ్ సర్వీసెస్ తో కలిసి పని చేస్తోంది. టాటా గ్రూప్ అధికారులు చెపుతున్న వివరాల ప్రకారం... టాటా కుటుంబానికి దత్తా చాలా సన్నిహితంగా ఉండేవారు. రతన్ టాటా మరణించినప్పుడు ఆయనతో తనకున్న సాన్నిహిత్యం గురించి దత్తా మాట్లాడుతూ... టాటా తనకు 24 ఏళ్ల వయసు ఉన్నప్పటి నుంచి తెలుసని చెప్పారు. తాను జీవితంలో ఎదగడానికి టాటా ఎంతో సాయం చేశారని తెలిపారు.

## భారతీయుల బహిష్కరణ కొత్తేమీ కాదు.. ఇప్పటి వరకు అమెరికా బహిష్కరణకు గురైనవారు ఎంతమందంటే..!

ఢిల్లీ: తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను అమెరికా వెనక్కి పంపుతోంది. ఇటీవల 104 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. వారితో వచ్చిన అమెరికా మిలటరీ విమానం బుధవారం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ల్యాండ్ అయింది. ఈ నేపథ్యంలో విదేశాంగ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ కీలక విషయాలు వెల్లడించారు. 2009 నుంచి ఇప్పటి వరకు 15,668 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా బహిష్కరించినట్టు జైశంకర్ నిన్న రాజ్యసభకు తెలిపారు. భారత వలసదారుల విషయంలో అమెరికా వ్యవహరించిన తీరుపై ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ అక్రమ వలసదారుల బహిష్కరణ కొత్తేమీ కాదని, కొన్నేళ్లుగా కొనసాగుతోందని చెప్పారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. 2009లో 734 మంది, 2010లో 799 మంది, 2011లో 597 మంది, 2012లో 530 మంది, 2013లో 515 మంది భారత వలసదారులను అమెరికా వెనక్కి పంపినట్టు జైశంకర్ తెలిపారు. 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పుడు 591 మందిని అమెరికా బహిష్కరించిందని, 2015లో 708 మందిని, 2016లో 1,303 మందిని, 2017లో 1,024 మందిని, 2018లో 1,180 మంది వలసదారులను అమెరికా వెనక్కి పంపిందని వివరించారు. 2019లో అత్యధికంగా 2,042 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా బహిష్కరించినట్టు తెలిపారు. 2020లో 1,889, 2021లో 805, 2022లో 862 మంది, 2023లో 617, గతేడాది 1,368 మందిని, ఇప్పుడు 104 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపిందని సభకు వివరించారు. తమ అదుపులో మహిళలు, చిన్నారులు లేరని ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) తమకు సమాచారమిచ్చిందని జైశంకర్ తెలిపారు.

# మంత్రులకు ర్యాంకులు.. ఎవరినీ తక్కువ చేయడానికి కాదు

మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నాం. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే... మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్నాం. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం. అయితే ఈ లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలి. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని నేను విశ్వసిస్తాను. అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప... విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేం. అందుకే ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్ తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే మా ఆలోచన. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్ లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చాం. ఫైళ్ల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు... ఎవరినీ తక్కువ చేయడానికి కాదు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పనిచేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇది. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో నేను కూడా నా స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉంది. 'పీపుల్ ఫస్ట్' విధానంతో నేను, నా కేబినెట్ సహచర మంత్రులంతా పనిచేస్తున్నాము. లక్ష్యాల సాధనకు అడుగులు వేస్తున్నాము. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పనిచేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి... సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలం. ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో శాఖల్లో అత్యున్నత ప్రతిభ చూపిస్తారని ఆశిస్తున్నాను" అని చంద్రబాబు వివరించారు.

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు... 28న బడ్జెట్!




అమరాతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరగనున్నాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు తెరలేవనుంది. ఈ నెల 27న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ చేపట్టనున్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలను మొత్తం 15 పని దినాల పాటు నిర్వహించాలనే యోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ సమావేశం తర్వాత సభ జరిగే రోజుల సంఖ్యపై స్పష్టత రానుంది. ఇక, ఫిబ్రవరి 28న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో, సభకు పూర్తి స్థాయి సబ్జెక్టుతో సిద్ధమై రావాలని సీఎం చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు.

# ఏపీలో ఉగాది నుంచి పి-4 విధానం అమలు

మొదటి పేజి తరువాయి

ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పి-4 విధానం ముఖ్య ఆశయమని ఆయన పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విధి విధానాల రూపకల్పనకు ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరించడంతో పాటు ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొందిస్తున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ సలహాలు, సూచనలు ఆధారంగానే పి-4 విధానాన్ని అమలు చేస్తామన్నారు. పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు తదితరులను ఉగాది రోజు జరిగే పి-4 ప్రారంభ కార్యక్రమానికి ప్రభుత్వం ఆహ్వానించి వారందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం ద్వారా పి-4 అమలుకు శ్రీకారం చుట్టనున్నట్టు సీఎస్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర విజన్-2047లో భాగంగా ప్రతి ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గం, జల్లా స్థాయి విజన్ ప్రణాళికలను రూపొందించాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు గాను ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నోడల్ అధికారికి ఆరుగురు సభ్యుల బృందం.. అంటే గ్రామ వార్డు సచివాలయాలకు చెందిన ఐదుగురు, ప్రణాళికా శాఖ ద్వారా ఒక ప్రొఫెషనల్ సహాయపడతారని అన్నారు. ప్రణాళికా శాఖ ద్వారా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా వివరాలు సేకరించాల్సి ఉంటుందని ఈ కన్సల్టెన్సీ సర్వేను ఫిబ్రవరి 7వ తేదీ నుండి 22వ తేదీ లోగా సేకరించాల్సి ఉందన్నారు. తొలుత ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పి-4 విధానం అమలు, స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ఆవాసం, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా ప్రణాళికల రూపకల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్ యువరాజ్ ఎంఎస్ఎంఇ సర్వే నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

శుభోదయం
శనివారం -08 -ఫిబ్రవరి-2025

## ముక్కెళ్ల లో భక్తిశ్రద్ధలతో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట..





తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోని ముక్కెళ్ల గ్రామంలో శుక్రవారం శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ, కలశ స్థాపన ప్రతిష్ట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజలు విరాళాలతో నూతన ఆలయాన్ని నిర్మించి, ఈ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కలశ స్థాపన కార్యక్రమాలను వేద బ్రాహ్మణ, పండితులు, వివిధ రకాల హెూమం,పూజలు చేసి ప్రతిష్టించారు. చేస్తూ ఉన్నారు. ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆలయ ముందు ధ్వజస్తంభ ప్రతిష్ట, అలాగే కలశ స్థాపన ప్రతిష్ట చెయ్యనున్నారు. గ్రామంలోకి బంధుమిత్రులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది. ఆడబిడ్డలకు కొత్త బట్టలు ఒడిబియ్యం పెట్టి పూజలు చేశారు. రాత్రి చెక్కభజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అధికారులు ప్రజల సమస్యల ను పరిష్కరించి ప్రజల తో మన్నలు పొందాలి...

### ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): ప్రభుత్వ అధికారులు గ్రామీణ ప్రాంతాల లోనే ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలతో ప్రభుత్వ ఉద్యోగులు మన్నలు పొందాలని పత్తికొండ ఆర్డిఓ డాక్టర్ భరత్ నాయక్ అన్నారు. శుక్రవారం తుగ్గలి లోనే తహసిల్దార్ కార్యాలయాన్ని ఆర్డిఓ డాక్టర్ భరత నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలను తెలియజేసే కి అధికారుల వద్దకు వచ్చినప్పుడు అధికారులు ఓపికతో వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఒకవేళ ఆ సమస్యలు మీ పరిధిలో లేకపోతే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాలని ప్రజలకు తెలుపాలని ఆయన తెలిపారు. అదేవిధంగా భూ సమస్యలను పొడిగించకుండా వాటిని రాజీమార్గంలో పరిష్కరించి, ఇరువురికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు ,మండల సర్వేయర్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ రాముడు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




రెంటచింతల, మండల రిపోర్టర్ – శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్యానల్ న్యాయవాదులు సూచించారు. శుక్రవారం రెంటచింతల లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మండల న్యాయ సేవాధికారి సంస్థ ( గురజాల) ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి పరిమి అలేఖ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని హక్కులను, న్యాయవ్యవస్థలోని చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు చదువుతోపాటు ఫోక్సో, నిర్భయ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బాలికలపై వేధింపులకు పాల్పడితే ఫోక్స్ చట్ట ప్రకారం శిక్ష తప్పదన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు హాస్టల్లోని వసతి గదులు, మరుగుదొడ్లు, వంటగది పరిశీలించి, బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శశికళ, జానీబాష, సురేష్, ప్రభుదాసు, ఎస్ డబ్ల్యూ ఓ సుజాత కుమారి, బాలికల హాస్టల్ వార్డెన్ జె అరుణ, ప్రభుత్వ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక



రెంటచింతల, మండల రిపోర్టర్ –శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : స్థానిక సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలలో ఐదు దశాబ్దాల విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల వజ్రోత్సవ వేడుకలను గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. 75 వసంతాల వెనుక దాగిన ఆత్మీయత ఆహ్వానించడంతో ప్రాంగణంలో స్నేహ పరిమళాల సుగంధం వెదజల్లింది. పాఠశాలలో చదువుకున్న వాళ్లు ఎన్నో సంవత్సరాల క్రితమే విడిపోయారు. ఎవరు ఎక్కడ ఉన్నారో? ఏం చేస్తున్నారో? తెలియని పరిస్థితి. కొందరు ఉద్యోగులస్తులైతే, కొందరు వ్యాపారస్తులుగా, మరి కొందరు వివిధ రంగాల్లో స్థిరపడి పనులు చేస్తూ అలసి జీవిత చరమాంకంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాంటి వారందరి ఫోన్లు సేకరించి, అందరిని ఒక చోట చేర్చే బాధ్యతను కొందరు పూర్వ విద్యార్థులు భుజస్కందాలపై వేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకుని మధురానుభూతులను పంచుకున్నారు. అనేక ఏళ్ల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని జీవన స్థితిగతులను తెలుసుకుని ఆనందంగా గడిపారు. వారు చదువుకున్న రోజుల్లో కొన్ని మధుర జ్ఞాపకాలు గుర్తు



చేసుకుంటూ సందడి చేశారు. దివంగతులైన ఉపాధ్యాయులను తలచుకుని ఆత్మ శాంతికి నివాళు లర్పించారు. తమ ఉన్నతికి సోపానమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందించిన పాఠశాలకు ఎల్లెడలా రుణపడి ఉంటామని పూర్వ విద్యార్థులు తెలిపారు.బోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి, గురువులతో అనుబంధాన్ని గుర్తుచేసుకుని సన్మానించి ఆశీర్వాదం పొందారు. పాఠశాల అభివృద్ధికి విరాళం అందించారు. వివిధ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గతానికీ ఇప్పటికి పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. తాము చదివిన పాఠశాలకు ప్రయోజనం చేకూరే పనులు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, పూర్వ విద్యార్థి ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ పల్నాట క్రమశిక్షణ విద్యకు మారుపేరుగా సెయింట్ జోసెఫ్ పాఠశాల పేరుగాంచిందన్నారు. ప్రతి పనికి, కార్యక్రమానికి లక్ష్యాలు, ఆశయాలు ఉన్నట్లే ఇటువంటి సమ్మేళనాలను సమయస్ఫూర్తిగా నిర్వహిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కొన్ని రంగాల్లో ఎదిగిన వారు, ప్రజా ప్రతినిధులు, నిపుణులు, విద్యావేత్తలు ముఖ్య అతిధులుగా సమ్మేళనానికి వచ్చిన వారి ప్రసంగాలు విద్యార్థులకు దిక్సూచిగా ఉంటాయన్నారు. ముఖ్యంగా సమ్మేళనాలు పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే కాక రాబోయే తరాలకు ఆదర్శంగా ఉంటుందనడంలో సందేహం లేదన్నారు. ముఖ్య అతిథులకు, పూర్వ విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ పీటర్ పాపయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీం తో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన ఆహుతులను అలరించింది.

## ఈ నెల 11 న ఆర్టీవో ఆధ్వర్యంలో ప్రైవేట్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలుః ఎంవిఐ శేషురెడ్డి



మాచర్ల నియోజకవర్గం ఇంచార్జ్, వేల్పుల చిన్న గురవయ్య ( శుభోదయం న్యూస్):-మానవుని శరీర అవయవాల్లో కళ్ళు ప్రధానమైనవి అని, అలాంటి కంటి లోపం వలన చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది అని పల్నాడు ప్రాంత మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి శేషు రెడ్డి అన్నారు ఈ నెల 11వతేదీ మంగళవారం ఉదయం పది గంటల నుండి కెసిపి విఎల్ దత్తు ఆడిటోరియంలో అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు,ఆటో డ్రైవర్లకు,లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు మరియూ కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు మాచర్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి. శేషురెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు.ఈ కార్యక్రమం ఆర్టీవో ఆధ్వర్యంలో జరుగుతున్న ట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమమునకు అన్ని ప్రైవేటు పాఠశాలల యజమానులు వారి యొక్క బస్సు డ్రైవర్లను తప్పనిసరిగా పంపించాలని ఆయన కోరారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి విగ్రహశిలాప్రతిష్టమహొత్సవ

### కార్యక్రమంలోపాల్గొన్న..కావలి శాసనసభ్యులు దగుమాటివెంకట క్రిష్ణారెడ్డి





(శుభోదయంన్యూస్) బిట్రగుంట:బోగోలు మండలంసోమేశ్వరపురం గ్రామంలోశుక్రవారంశ్రీకామాక్షిదేవి సమేతశ్రీసోమేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారివిగ్రహ శిలాప్రతిష్టమహొత్సవ కార్యక్రమంలోకావలి శాసనసభ్యులుదగుమాటివెంకట క్రిష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఎమ్మెల్యేకిఆలయ కమిటీసభ్యులు,టిడిపి నాయకులు, గ్రామస్తులు. ఘనస్వాగతంపలికారు. అనంతరంఎంఎల్ ఎ స్వామివారినిదర్శించుకునిప్రత్యేక పూజాకార్యక్రమంలో పాల్గొన్నారు.ఈసందర్భంగాఆయన



మాట్లాడుతూ.శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి విగ్రహశిలాప్రతిష్టమహొత్సవ కార్యక్రమంలోపాల్గొనడం చాలా సంతోషంగాఉందని. ఆలయ నిర్మాణంమరియుప్రతిష్ట కార్యక్రమందాతలు బచ్చుకృష్ణ కుమార్,సంధ్యదంపతులను ఎమ్మెల్యేఅభినందించారు.అమర బచ్చుచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోవారుచేస్తున్నసేవ మరవలేనిదని,అక్కఆశయాల కోసంతమ్ముడుచేస్తున్నసేవ అద్భుతం అనికొనియాడారు.స్వామివారి ఆశీస్సులు కావలినియోజకవర్గ ప్రజలందరిపైఉండాలని,ప్రతి ఒక్కరు పాడిపంటలతోసుభిక్షంగా ఉండాలనికోరుకున్నానన్నారు. కావలిఅభివృద్ధికినిరంతరంకృషి చేస్తున్నానని,కావలి నియోజకవర్గంలోఎవరికిఎలాంటి ఇబ్బందిరాకుండాకాపుకాస్తానని తెలిపారు.సోమేశ్వరపురంప్రజలు చూపుతున్నఅభిమానం ఎనలేనిదని తెలిపారు.పై కార్యక్రమంలోటిడిపినాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు..

## లింగసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకము పనులను పరిశీలించిన ఏపీ డి జే బాబురరావు



: లింగసముద్రం సురేష్ (శుభోదయం న్యూస్ ): లింగసముద్రం మండలంలోని ఆర్ఆర్ పాలెం లింగసముద్రం మొగిలిచర్ల గ్రామపంచాయతీల నందు జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను కందుకూరు క్లస్టర్ ఏపీ డి చే బాబురావు పరిశీలించారు. పనిచేసే వేతన దారులతో మాట్లాడి కొలతలు ప్రకారము పనులు చేసుకోవాలని సమయపాలన పాటించాలని



తెలిపారు కనీసం నాలుగు గంటల పాటు పని అధికంగా ఫారం పాండ్ పనులు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. తదుపరి ఆయన ఎఫ్ఏ లతో మండల ఆఫీసులో సమావేశం నిర్వహించి అన్ని గ్రామాల పనులు ప్రారంభించాలని ఎఫ్ఎ లకు సూచించారు ఈ సమావేశంలో ఎంపీడీవో కట్టా శ్రీనివాసరావు మరియు టెక్నికల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## : ప్లాటినం చర్చ్ 95 వవార్షికోత్సవం



( శుభోదయం న్యూస్) బిట్రగుంట: బోగోలుమండలం విశ్వనాథరావుపేటలోని ప్లాటినంతెలుగుబాప్టిస్ట్ చర్చ్ లో శుక్రవారం 95వ ఆలయ వార్షికోత్సవంఘనంగానిర్వహించడంజరిగింది. కార్యక్రమానికిముఖ్య ప్రసంగీకులుగావిచ్చేసిన రెవరెండ్ డాక్టర్ జి.రోజర్ తెలుగుబాప్టిస్ట్ చర్చ్ కావలి, ప్రత్యేకదైవసందేశంఅందించారు. అనంతరం500మంది పేదలకువస్త్రదానం,అన్నదానవితరణచేశారు. పైకార్యక్రమంలో సంఘకాపరి రెవరెండ్ ఎన్. ఎబినేజర్, చర్చిచైర్మన్ ఎల్. డేవిడ్ రాజు, కార్యదర్శిచంద్రహాస్, కోశాధికారిమనోహర్,సిహెచ్.నాగరాజు, కమిటీ సభ్యులు,సంఘపెద్దలు, సంఘస్తులుతదితరులు పాల్గొన్నారు.

## : ఆర్ ఎస్ ఆర్ లోమెగారక్తదాన శిబిరం



బిట్రగుంట: (శుభోదయం న్యూస్) : బోగోలుమండలంకడనూతల గ్రామంలోగలరామిరెడ్డి సుబ్బరామిరెడ్డిఇంజనీరింగ్ కళాశాలలోశుక్రవారం ఫౌండర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అయిన రామిరెడ్డిసుబ్బారెడ్డిజ్ఞాపకార్థం మెగారక్తదానశిబిరం నిర్వహించినట్లుకళాశాలప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డితెలిపారు. శిబిరాన్ని నెల్లూరునారాయణ హాస్పిటల్ వారిసౌజన్యంతో, ఎన్ ఎస్ ఎస్ వారిసహాయ సహకారాలతోనిర్వహించారు.శిభిరంనందు147మందిరక్త దానంచేసినట్లువారుతెలిపారు.



ఇప్పటివరకుకళాశాలలో 47 శిబిరాలునిర్వహించి 2495 బ్యాగులనురక్తందానం చేశారన్నారు.శిబిరంలోప్రస్తుత కళాశాలఅడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డికూడారక్తం దానంచేయడంవిశేషం. పై కార్యక్రమంలోకళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి రమణారెడ్డి, అన్నివిభాగాల అధిపతులు, నారాయణ హాస్పిటల్ డాక్టర్ డాక్టర్ ఏ. యసువర్ధన్ తోపాటుఆరుగురు సిబ్బంది మరియుఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ. కిరణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## శ్రీ కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట కలిశములో పాల్గొన్న ఎమ్మెల్సీ తోమాటి మాధవరావు :




లింగసముద్రం సురేష్ (శుభోదయం న్యూస్ ): లింగసముద్రము మండలం, ముత్యాలపాడు గ్రామములోని శ్రీ కోదండరామ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భముగా జరిగిన కలిశముల కార్యక్రమములో పాల్గొన్న కందుకూరు నియోజకవర్గం ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావు :

## రాయల చెరువు రైల్వే స్టేషన్లో ఎక్స్ ప్రెస్ ట్రైన్ లను ఆపాలని వినతి



యాడికి ఫిబ్రవరి 07 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) మండల కేంద్రానికి అతి చేరువగా ఉన్న రాయలచెరువు రైల్వే స్టేషన్లో ఎక్స్ ప్రెస్ రైళ్లను నిలపాలని రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలుగుదేశం పార్టీ నాయకులు, రాయల చెరువు లయన్స్ క్లబ్ వారు తెలియజేశారు. కరోనా కన్నా ముందు రాయలచెరువు రైల్వే స్టేషన్లో ఎగ్మోర్ ఎక్స్ప్రెస్ తో సహా పలు రైళ్ళను నిలిపే వారని వాటి వల్ల దూరప్రాంతాలకు వెళ్లే యాడికి మండల ప్రజలకు రవాణా సౌకర్యం అణువుగా ఉండేదని కానీ ఇప్పుడు వాటిని నిలుపకపోవడం వల్ల దూరప్రాంతాలకు వెళ్లే యాడికి మండల ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని కావున ధర్మవరం – మచిలీపట్నం మరియు కాచిగూడ – ఎగ్మోర్ వెళ్లే రైళ్లను రాయలచెరువు రైల్వే స్టేషన్ లో నిలపడం వల్ల ఆయా ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు, వ్యాపార పరంగా వెళ్లే ప్రజలకు రవాణా సౌకర్యం అణువుగా ఉంటుందని రాయలచెరువు రైల్వే స్టేషన్ కు వచ్చిన డి.ఆర్.ఎం చంద్రశేఖర్ గుప్తా ను కలిసి వినతిపత్రం అందించామని తెలుగుదేశం నాయకులు, రాయల చెరువు లయన్స్ క్లబ్ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాగముణి రెడ్డి, నెట్టికంటయ్య, రహమతుల్లా, రమేష్ శ్రీకాంత్ లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ చల్లా సూర్యనారాయణ, ఇస్మాయిల్ పాల్గొనడం జరిగింది.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిక్కా భీమేశ్వరావు నామినేషన్ దాఖలు



ఏలూరు, (శుభోదయం న్యూస్) : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న చిక్కా భీమేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్మిక సంఘాల నాయకులు, పలువురు నగర ప్రముఖులు, మేధావి వర్గాలు చెందిన వారితో కలిసి మహాత్మ జ్యోతిరావు పూలే, శారద దంపతుల విగ్రహాలకు చిక్కా భీమేశ్వరరావు దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కలెక్టరేట్ కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కు నామినేషన్ పత్రాలను చిక్కా భీమేశ్వరరావు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరిస్తూ పేద వర్గాలకు న్యాయ సహాయం చేస్తున్నానని చెప్పారు. సమాజంలో జరుగుతున్న కష్టసుఖాలను అవగతం చేసుకున్న ఒక సామాన్యమైన వ్యక్తి శాసన మండలికి వెళ్తే పట్టబుద్రులు ఆశిస్తున్న లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో తాను ఎక్కడికి వెళ్లినా పట్టభద్రులు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని చెప్పారు. పట్టబద్రుల సంక్షేమానికి కృషి చేస్తానని, ఈనెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటును తనకు వేసి భారీ మెజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలని పట్టబద్రులకు చిక్కా భీమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# టిడిపి,వైసిపి వర్గాలు ఒకరిపై ఒకరు దాడి



వెంకటగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ వీసి.సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): తిరుపతి జిల్లా డక్కిలి మండల పరిధిలోని డక్కిలి పంచాయతీలో ఉపాధిహామీ పనులలో అక్రమాలు జరుగుతున్నాయని నరసనాయుడు పల్లికి చెందిన రైతులు పిడి కి పిర్యాదు చేసారు. దీనితో ఆయన విచారణకు ఆదేశాలు జారిచేసారు. ఈ రోజు విజిలెన్స్ అధికారి వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డక్కిలి పంచాయతీ పరిధిలో నరసనాయుడు పల్లికి చెందిన గ్రామస్తులు గ్రామీణ ఉపాధిహామీ పనులలో అక్రమాలు చోటుచేసుకొన్నాయని... పనికి రాని వాళ్ళకి కూడా మస్టర్లు వేస్తున్నారని పిర్యాదు



చేసారని ఇందులో భాగంగానే విచారణ చేపట్టామని.. విచారణ అనంతరం రిపోర్ట్ ను పైఅధికారులకు నివేదిస్తామని .. ...విచారణలో అక్రమాలు నిజమని తెలితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. విచారణ జరుగుతున్నా సమయంలో వైసీపీ , టీడీపీ కార్యాకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకొన్నారు. చొక్కాలు పట్టుకొని దాడులు పాల్పడ్డారు దీనితో డక్కిలి సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను అక్కడనుంచి పంపివేశారు. నిజానికి ఉపాధిహామీ పనులలో అక్రమాలు జరుగుతున్నాయని పిర్యాదులు అందడం కొత్తేమీకాదు గతంలో అనేక పిర్యాదులు అందాయి.ప్రభుత్వాలు , అధికారులు ఎన్ని చర్యలు తీసుకొంటున్న అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.. పనికిరానివాళ్లకు మస్టర్లు వేయడం వాళ్ళ నుంచి డబ్బులు దండుకోవం దుర్మార్గమైన చర్య దీనిపై అధికారులు చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కానీ ప్రజల సమస్యలను రాజకీయం చేయడం మంచిది కాదు. ఇలాంటి చర్యల వళ్ళ అనేక పరిణామాలు చోటుచేసుకొనే అవకాశం ఉంది. డక్కిలి లో విచారణ జరుగుతున్నా సమయంలో టీడీపీ , వైసీపీ వర్గాలు ఒకరిఒకరు దాడులు చేసుకొని ప్రజా సమస్యను రాజకీయ ఆధిపత్య పోరుగా మార్చుడం సరైనది కాదు . దీని వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం లేకపోలేదని విశ్లేకుల వాదన.

## డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మల్లె బోయిన బాల బ్రహ్మయ్య






ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్) : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు ఫిబ్రవరి 8 సందర్భంగా ఆయనకు జన్మదిన శు భాకాంక్షలు తెలుపుతున్నట్లు తిరగలదిన్నె టిడిపి సీనియర్ నాయకులు మల్లెబోయిన బాల బ్రహ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ వైద్యశాలలు, విద్యా, వైద్యం మౌలిక వసతుల కల్పనలో వేగంగా ముందుకు పోతూ ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ ఉగ్ర అభినందనీయుడని వారన్నారు. భవిష్యత్తులో డాక్టర్ ఉగ్ర మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు మల్లెబోయిన తెలిపారు

## కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చుంచు, మోరబోయిన





ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్) : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు ఫిబ్రవరి 8 సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు మోపాడు రిజర్వాయర్ సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, సూపర్ వైస్ చైర్మన్ మోరబోయిన నరసింహారావు లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ వైద్యశాలలు, విద్యా, వైద్యం మౌలిక వసతుల కల్పనలో వేగంగా ముందుకు పోతూ ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ ఉగ్ర అభినందనీయుడని వారన్నారు. భవిష్యత్తులో డాక్టర్ ఉగ్ర మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు

# స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి కాంస్య విగ్రహ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర శుభోదయం న్యూస్ (ఉదయగిరి)తెలుగుదేశం సీనియర్ నాయకులు ఆర్యవైశ్య ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు, మున్సిపల్ మాజీ చైర్మన్, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ స్వర్గీయ గ్రంధి యానాదిశెట్టి విగ్రహ శంకుస్థాపన మహోత్సవంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తో కలిసి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. కావలిలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహ సెంటర్ ప్రాంగణంలో మాగుంట పార్వతమ్మ రోడ్డులో శుక్రవారం గ్రంధి యానాదిశెట్టి కుటుంబ సభ్యులతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధి యానాదిశెట్టి అభిమానులు ఆర్యవైశ్య కుటుంబీకులు కూటమి నాయకులు మరియు ఆత్మీయులు తదితరులు ఉన్నారు.

## మల్లిఖార్జున పురం లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం.



దోర్నాల మండల రిపోర్టర్-ఆవులయ్య (శుభోదయం న్యూస్)ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం దోర్నాల మండలం కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని %%. చెర్లోపల్లి సచివాలయం మల్లిఖార్జున పురం గూడెం లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల సబ్ యూనిట్ ఆఫీసర్ సి హెచ్. రమేష్ బాబు, మలేరియా సూపర్వైజర్ కందుల ఇశ్రాయేలు మాట్లాడుతూ



ఇంటిలో మరియు ఇంటి పరిసరాల లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని తద్వారా వచ్చు వ్యాధులను మలేరియా,డెంగ్యూ, చికన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు నివరించవచ్చు అని కూడా చెప్పారు. టైర్లు, కొబ్బరిబోండాల్లా, ఫ్రిజ్ లు, పూల కుండీ లు, కూలర్ లు ప్రతి శుక్రవారం నీరు లేకుండా చేసి ఆరపెట్టి వాడుకోవాలని కూడా చెప్పారు. ఎలిమెంటరీ స్కూల్లో విద్యార్థులకు ఆరోగ్య విద్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కోర్రప్రోలు సూపర్వైజర్ రాఘవేంద్ర రావు, మూగెమ్మ , ఆశా లక్ష్మీ దేవి, ఎలిమెంటరీ స్కూల్ టీచర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బంగారు బాల్యాన్ని కాపాడుదాం' గ్రామస్థాయి అవగాహన సమావేశం





సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సోమరాజుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బంగారు బాల్యం గ్రామస్థాయి అవగాహన సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు వేల్పుల సింగయ్య మాట్లాడుతూ, బాల కార్మికత్వం, బాల్య వివాహాలు నేరం అని, ఇటువంటి సంఘటనలు ఎక్కడైనా జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బాలల సంరక్షణ మనందరి బాధ్యత అని తెలియజేశారు. సాంత్వనా సేవా సమితి డైరెక్టర్ జయకుమార్ మాట్లాడుతూ, ప్రకాశం జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం బాలల హక్కులను పరిరక్షించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.మహిళా పోలీస్ కళ్యాణి మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల పిల్లలకు కలిగే అనారోగ్య సమస్యలు, భవిష్యత్తులో వాటి ప్రభావాల గురించి వివరించారు.ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్లు, ఐసీడీసీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొని తమ మద్దతు తెలిపారు. బాలల భవిష్యత్తును కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## సింగరాయకొండ కనుమల్ల చెరువులో ఎన్ డి ఆర్ ఎఫ్ మాక్ డ్రిల్




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-ఒంగోలు నుండి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, డిజాస్టర్ మానేజ్మెంట్ ఆధ్వర్యంలో కనుమల్ల చెరువు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కమాండెంట్ అధికారి మన్మోహన్ యాదవ్, ఎన్ డి ఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్ మరియు వారి సిబ్బంది పాల్గొని జలవిపత్తుల్లో ప్రజలను రక్షించే విధానాలపై అవగాహన కల్పించారు.మాక్ డ్రిల్ సందర్భంగా నీటి మూలాలు నదులు, చెరువులు, గుంటలు వంటి ప్రదేశాల్లో ప్రమాదవశాత్తూ నీటిలో చిక్కుకున్న బాధితులను ఎలా రక్షించాలి? అత్యవసర పరిస్థితుల్లో స్పందనా చర్యలు ఎలా ఉండాలి? అనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు.కనుమల్ల గ్రామానికి చెందిన స్థానిక ప్రజలు మాక్ డ్రిల్ను వీక్షించి విపత్తు నిర్వహణపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీ టి. రవి (తహసీల్దార్), శ్రీమతి యం. ఇంద్రదేవి (గ్రామ సర్పంచ్), శ్రీ యం. సింగయ్య (నీటి సంఘాల ప్రెసిడెంట్) మరియు మండల స్థాయి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడుదోర్నాలలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొననున్న గౌరవనీయులు శ్రీగూడూరిఎరిక్షన్ బాబు గారు




దోర్నాల మండలం రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్)ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంనేడు అనగా 08-02-2025 శనివారం ఉదయం 10 గంటలకు దోర్నాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణములో గల ఆడిటోరియం నందు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు మండల ప్రజా సమస్యల పై ప్రజా వేదిక కార్యక్రమము జరుగును. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు గారు పాల్గొంటారు...కావున దోర్నాల మండలంలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని తమ సమస్యల పరిష్కార వేదికగా చేసుకోవాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము...యేరువ మల్లికార్జున రెడ్డిదోర్నాల మండల టీడీపీ అధ్యక్షులు

## దోర్నాలలో పర్యాటక హబ్ ఏర్పాటు చేయాలంటూ వినతి



దోర్నాల మండల రిపోర్టర్-ఆవులయ్య (శుభోదయం న్యూస్)ప్రకాశం జిల్లా, పెద్దదోర్నాల మండలం"ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గౌరవనీయులు శ్రీ నూకసాని బాలాజీ"ని కలిసిన దోర్నాల మండల టిడిపి నాయకులు, త్వరలో దోర్నాల వస్తానని వెలుగొండ ప్రాజెక్టు వద్ద పర్యాటక హబ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తానని సానుకూలంగా స్పందించిన నూకసానిబాలాజీ ఈ కార్యక్రమంలో పెద్ద దోర్నాల తెలుగుదేశం పార్టీ నాయకులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏరువ మల్లికార్జున రెడ్డి, టి ఎన్ టి యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి, తాతిరెడ్డి, వల్లభనేని కాశయ్య, చిన్న (చంటి), వెంకటేశ్వర్లు, షేక్ మాబు, చిట్టే శివారెడ్డి, దొడ్డ శేషాద్రి, వెంగల్ రెడ్డి, మరియు దోర్నాల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పామూరులో ఘనంగా ముందస్తు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్)కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో ఘనంగా ఆంటీ నందు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా టిడిపి శ్రేణులు నిర్వహించారు. ముందుగా పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి కేక్ కట్ చేసి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు తినిపించారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, నిత్య కృషివళుడు, అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు, సిద్ధించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉగ్రసేన నాయకులు తుమ్మ కొండారెడ్డి, టిడిపి నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, వరికూటి హనుమంతు, చిరంజీవి, ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉప్పుగళ్ల సురేష్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య, చావా సుబ్బారావు, రెక్కల రమణారెడ్డి, యరసింగ్ రాయుడు, మట్లె రాహుల్ యాదవ్, తదితర టిడిపి శ్రేణులు భారీగా పాల్గొన్నారు

# ప్రకాశం జిల్లా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ యాక్టివిటీ గా గాయకవాడ సుభాషిని నియమితులైనారు



పామూరు మండలం రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్)గాయకవాడ . సుభాషిని గత 10 సంవత్సరములుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తన శక్తి మేర పార్టీ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నందుకు గురువారం విడుదల చేసిన వైఎస్ఆర్సిపి జిల్లా కమిటీ లో సెక్రటరీ యాక్టివిటీ గా నియమించి నందుకు నా మీద నమ్మకంతో ఈ పదవి వచ్చినందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి ,ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కి ,ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కి,కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి డా. దద్దాల నారాయణ యాదవ్ కి, పామూరు మండల వైఎస్ఆర్సిపి నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా సెక్రెటరీ యాక్టివిటీ గా నియమితులైన గాయకవాడ. సుభాషిని మాట్లాడుతూ రాబోవు 2029 ఎన్ని కలలో వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేదాకా నా శక్తి మేర వైఎస్ఆర్ పార్టీ అభివృద్ధి కొరకు పనిచేస్తానని అన్నారు

శుభోదయం

శనివారం -08 -ఫిబ్రవరి-2025

## శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

**బోయళ్ల నారాయణరెడ్డి వరికూటి చిరంజీవి పాలపర్తి వెంకటేశ్వర్లు**




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్)కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు ఫిబ్రవరి 8 సందర్భంగా ఆయనకు 565 హైవేలో ఆం టీ వద్ద కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నాయకులు , ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ




అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ వైద్యశాలలు, విద్యా, వైద్యం మౌలిక వసతుల కల్పనలో వేగంగా ముందుకు పోతూ ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ ఉగ్ర అభినందనీయుడని వారన్నారు. భవిష్యత్తులో డాక్టర్ ఉగ్ర మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారుఈ కార్యక్రమంలో కొండిశెట్టి రమణయ్య, వరికూటి హనుమంతురావు, సిద్ధమూర్తి లక్ష్మీనారాయణ రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, కటకం శివ, గోపి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైరెడ్డి ,దారపనేని ఆధ్వర్యంలో పామూరులో ఘనంగా జరిగిన డాక్టర్ ఉగ్ర ముందస్తు జన్మదిన వేడుకలు



ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర శుభోదయం న్యూస్ (కనిగిరి/ పామూరు)కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో ఘనంగా ఆంటీ నందు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా టిడిపి శ్రేణులు నిర్వహించారు. ముందుగా పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి కేక్ కట్ చేసి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు తినిపించారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, నిత్య కృషివళుడు, అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఆ భగవంతుడు ఎల్లవేళలా ఆయురారోగ్యాలు, సిద్ధించాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు టిడిపి శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉగ్రసేన నాయకులు తుమ్మ కొండారెడ్డి, టిడిపి నాయకులు పాలపర్తి వెంకటేశ్వర్లు, వరికూటి హనుమంతు, చిరంజీవి, ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉప్పుగళ్ల సురేష్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య, చావా సుబ్బారావు, రెక్కల రమణారెడ్డి, యరసింగ్ రాయుడు, మట్లె రాహుల్ యాదవ్, తదితర టిడిపి శ్రేణులు భారీగా పాల్గొన్నారు

## నూతన పోలేరమ్మ తల్లి దేవస్థాన ప్రారంభోత్సవానికి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర ను ఆహ్వానించిన. అంచురి వెంకట రెడ్డి పాలపర్తి రమణయ్య



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) పామూరు మండల గోపాలపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం ప్రారంభోత్సవానికి గోపాలపురం పట్టణ టిడిపి నాయకులు అంచూరి వెంకటరెడ్డి, పాలపర్తి రమణయ్య వారు ఇరువురు కలిసి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి వారిని దేవస్థానం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గోపాలపురం టిడిపి నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేత!

టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు టంగుటూరు మండల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో టంగుటూరు మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమతో సహకరించాలన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణ కోసం సింగరాయకొండ పంచాయతీలో ఫాగింగ్ కార్యక్రమానికి ప్రారంభం



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధుల ప్రబలింపు కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ సెక్రటరీ నర్రా జగదీశ్ బాబు గారి నేతృత్వంలో స్థానిక ట్రంక్ రోడ్డులో ప్రారంభమైంది.ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ నర్రా జగదీశ్ బాబు మాట్లాడుతూ, ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే పంచాయతీ ప్రధాన లక్ష్యమని, ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం ఎప్పుడూ ముందుండేందుకు సిద్ధమని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పడిదపు రవి కుమార్, పాదర్తి కోటేశ్వరరావు, సవలం కోటేశ్వరరావు, బిల్ కలెక్టర్ చెరుకూరి శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది అవ్వారు నరసింహ, నక్కా శ్రీను, మాల్యాద్రి, శానిటరీ ఇన్‌చార్జి సతీష్, తన్నీరు శివ నాగరాజు, సతీష్, అశోక్, వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు..

## టిడిపి నాయకుడు నాగేశ్వరరావును పరామర్శించిన రుద్రమ నాయుడు



యాడికి ఫిబ్రవరి 07 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ ( శుభోదయం న్యూస్ ) మండల కేంద్రంలోని కమ్మ వీధికి చెందిన గంగినేని నాగేశ్వరరావు అనారోగ్యంతో కాలుకు ఆపరేషన్ చేయించుకోవడంతో శుక్రవారం తెలుగుదేశం పార్టీ యాడికి మండల కన్వీనర్ గోర్తి రుద్రమ నాయుడు గంగినేని నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి పరామర్శించి వివరాలను తెలుసుకోవడం జరిగింది. అనారోగ్య సమస్య నుంచి తొందరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని గంగినేని నాగేశ్వరరావుకు తెలిపారు.పరామర్శించిన వారిలో కోడూరు నీలకంఠారెడ్డి, రహంతుల్లా తదితర టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

## సంచార 36 జాతులు కుల గణన చేయాలి..!!

### గౌరవ సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుల ఆర్.గోవిందరావు...



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొడ్డాన. శ్రీనివాస్(శుభోదయం న్యూస్):కూటమి రాష్ట్ర ప్రభుత్వ సచవాలయాలు ద్వారా ఈ సంచార జాతులు కుల గణన చేయాలని. అదేశించారు.రాష్ట్రంలో ప్రతీ ఒక్క సచివాలయం భాద్యతగా తీసుకొని ఇంట సర్వే చేస్తేనే సంచార జాతులు లో ఉన్న ఆయా కులాల జనాభా సంఖ్య ఖచ్చితంగా తెలుస్తుంది. అధికారులు భాద్యతతో చిత్త శుద్ధితో న్యాయం చేస్తే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అర్హత ఉన్నవారికి అంది .సుఖ జీవనం సాగిస్తారు.అధికారుల భాద్యత లేకంటే ప్రభుత్వానికి చెడ్డ పేరు.సంచార జాతులు కు కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందాలి అంటే సీడ్ సర్వే జరిపి సంచార జాతులు కు డి టీ న్ ( డీ నోట్ పై ట్రైబ్స్) కు ఎమ్మార్వో అనుమతితో డి టి న్ అని వ్రాసి సర్టిఫికెట్స్ ఇవ్వాలి. అప్పుడే సంచార జాతులుకుకేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందు కొని సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయంగా గౌరవ గుర్తింపుతో గౌరవం పొందడం జరుగు తుంది. నాటి నుండి నేటి వరకు సమాజంలో సంచార జీవనంలో భాగంగా ఊరు, ఊరు తిరుగుతూ యాచన్ చేస్తూ కూడు,గూడు ,గుడ్డ లేనివారు ఎందరో స్వాతంత్రం వచ్చి 76 సం.లు అయినా నిజమైన స్వాతంత్ర్యం సంతృప్తి లేదు. ఇప్పటికీ రాష్ట్రం, కేంద్రంలో సరైన సంచార జాతులు కుల ఎంఖ్యస్పష్టత లేదు. అనేక కమీషన్ లు వేసినాపేదల స్థితి గతులు మారలేదు.సంచార జాతులునీ బ్రిటీష్ వారి కాలంలో దోపిడీ దారులు , గజదొంగలు క్రిమినల్స్ గా ముద్రవేశారు.వారితో సంచార జాతులు సంఘనాయకులు పోరాడిక్రిమినల్స్ పేరును తొలగించే విధంగా కృషి చేశారు. అప్పుడు డి టీ న్ గా (డీ నోట్ పై ట్రైబ్స్) గా కేంద్ర ప్రభుత్వం గురించారు.కానీ ఎమ్మార్వో లు మా సంచార జాతులు కులాల సర్టిఫికెట్ల పై డి టి న్ అని వ్రాయనందునప ప్రభుత్వ పథకాలు అందటంలేదు. పేదలు పేదలుగా గానే ఎక్కడ వేసిన గొంగళి గానే ఉన్నాం.సీడ్ సర్వే చేస్తేనే కేంద్ర సబ్సిడీ లోన్ లు పొందగలం. ప్రజాప్రతినిధులు,అధికారులు మీకు మా సంచార (36)జాతులు తరుపున రెండు చేతులు ఎత్తి నమస్కారం చేస్తూ అభ్యర్ధన.అలాగా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ లోన్లు ఇస్తాం దరఖాస్తు చేసుకోండి అని మండల ఎంపీడీవో ద్వారా ప్రకటన ఇచ్చారు. సంక్రాంతి పండగ రోజులు తేదీలు ఇచ్చిఆన్లైన్ చేసుకోమని .ఇప్పటికీ పది రోజులు దాటినా సైట్ ఓపెన్ ప్రభుత్వం చేయలేదు అనే మాట వినిపిస్తోంది. సైట్ ఓపెన్ చేసి ప్రభుత్వం అర్హులు దరఖాస్తు చేసుకునే విధంగా సహకరించ వలెను.ఏపీ : రాష్ట్ర సంచార జాతులు అభివృద్ది మండలి గౌరవ సలహాదారులు .రాష్ట్ర దాసరి ఉపాధ్యక్షులురాముద్రి .గోవింద రావు బొబ్బిలిజిసెల్ : 85008 65056

## అమ్మవారిని దర్శించుకున్న బి ఆర్ ఎస్

### ములుగు జిల్లా నియోజకవర్గ నాయకులు భూక్య జంపన్న




(శుభోదయం న్యూస్ ): రిపోర్టర్ తులసి)గోవిందరావుపేట మండలం ఫ్రూట్ ఫారం గ్రామంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న మినీ మేడారం సమ్మక్క సారమ్మల జాతరకు ముఖ్యఅతిథిగా హాజరైన టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజు గౌడ్ గారు బి ఆర్ ఎస్ ములుగు జిల్లా నియోజకవర్గ నాయకులు భూక్య జంపన్న పూజారి దేవుడు సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా కన్నుల పండుగ మినీ మేడారం ఫ్రూట్ ఫారం సమ్మక్క సారలమ్మ జాతర ఈ కార్యక్రమం లో లకావత్ నరసింహ నాయక్ మండల పార్టీ అధ్యక్షులు (బి ఆర్ ఎస్) పూర్ణచందర్ చల్వాయి అధ్యక్షుడు బొల్లం ప్రసాద్ సీనియర్ నాయకులు బొడిగా రఘువీర్ ఏనుగుల సాంబశివరావు టి రాజు, గుండారపు రాజు, ములుగు రాజన్న,విక్రమ్ యాదవ్ నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు రిజర్వేషన్లు 11 శాతం రావాల్సిందే -వర్గీకరణ మందకృష్ణ మాదిగతోనే సాధ్యం

**-వందల డప్పులతో రోడ్డెక్కిన శంకర్ పల్లి మాదిగ యువకులు**

**-కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు**

**-బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి అధ్యక్షులు**



ప్రతినిధి శంకర్ పల్లి,(శుభోదయం న్యూస్ ):30 యేళ్ల వర్గీకరణ పోరాటంలో ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎన్నో ఆటుపోట్లకు ఎదురొడ్డి ముక్తకంఠంతో వర్గీకరణ సుసాధ్యం చేశారు. మందకృష్ణ మాదిగ పోరాటంతోనే మాదిగలకు, మాదిగ ఉప కులాలకు, మాల ఉప కులాలకు రిజర్వేషన్లు వచ్చాయని.. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు రాష్ట్రాలు అమలు చేసుకోవాలని తెలిపిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి 30 యేళ్ల వర్గీకరణ పోరాటం గుర్తుంది. కాని మాదిగల చిరకాల ఆంకాంక్షను నేరవేర్చిన మంద కృష్ణ పేరును కూడ అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలకపోవడం పట్ల మాదిగలు, మాదిగ ఉపకులాలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నామని, శంకర్ పల్లి మండల అధ్యక్షులు బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేల గొంతులు, లక్ష డప్పుల కార్యాక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగలకు జనాభా ప్రాతిపదిక వాటా పంచినా, వెనక బడిన జాతుల ప్రకారమైనా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ రావాలన్నారు. పంపకాలలో మాదిగలకు అన్యాయం జరిగితే ఇంతకన్నా పెద్ద ఎత్తున ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి మాదిగలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎవరివాటా వారికి పంపకం చాతకాలేదా ఈ ముఖ్యమంత్రికి లేదా మాలల వత్తిడికి తలొగ్గి మాదిగలకు కేవలం 9 శాతం రిజర్వేషన్ ఇచ్చారా అంటు ప్రశ్నించారు. దాదాపు 300 వందల డప్పులతో వందల సంఖ్యలో మాదిగలు చౌరస్తాపైకి వచ్చి డప్పులను కొడుతుంటే చౌరస్తా మారుమోగింది, మాదిగల డప్పుల విన్యాసాలు, ఆట పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. మాట్లాడుతూ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వంపకాలలో మాదిగలకు అన్యాయం జరిగిందనడానికి లేదని, ఇంకా వేల గొంతులు, లక్ష డప్పుల కార్యాక్రమానికి ఇంకా పెద్ద ఎత్తున డప్పులను పెంచాలని మండలంలోని గ్రామాల ఎమార్పీఎస్ అధ్యక్షులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధికార ప్రతినిధి శ్రీనివాస్ మాదిగ, కోశాధికారి తొంట నర్సింహ, ప్రచార కార్యదర్శి ప్రశాంత్ మాదిగ, శేఖర్, సంపత్, సత్తిష్ చంద్ర, సాయి గణేష్, భాను ప్రసాద్, కిరణ్ కుమార్, రమేష్, వెంకట్, మాజీ ఎంపిటిసి రామచందర్, లక్ష్మయ్య, సింగర్ సంజీవ, రామచందర్, రాజ్ కుమార్, క్రిష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చందిప్ప హనుమాన్ ఆలయంలో కాంట్రాక్టర్ ధూళిపాల రవి కుమార్ చౌదరి ప్రత్యేక పూజలు



ప్రతినిధి శంకర్‌పల్లి: (శుభోదయం న్యూస్ ):శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలోని నూతన హనుమాన్ ఆలయంలో స్థానిక కాంట్రాక్టర్ ధూళిపాల రవి కుమార్ చౌదరి శుక్రవారం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కాంట్రాక్టర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ దూళిపాల రవి కుమార్ చౌదరి మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలియజేశారు. అనంతరం ఆలయ నిర్వహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కాంట్రాక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు స్వప్న మోహన్, శ్రీనివాస్, గ్రామ పెద్దలు దేవేందర్ రెడ్డి, ఇంద్ర సేనారెడ్డి, సదానందం గౌడ్, సాగర్ యాదవ్ రాజు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, డాకిరెడ్డి, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు ఉన్నారు.

## ఘనంగా తెలంగాణ దండోరా 4వ ఆవిర్భావ వేడుకలు.

### మాత రమాబాయి జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు.



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్): గత మూడు సంవత్సరాలుగా తెలంగాణ దండోరా ఆధ్వర్యంలో జాతి ప్రయోజనాల కొరకు ఎన్నో కార్యక్రమాలు చేశామని, తెలంగాణ దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్ మాదిగ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని లాలాగూడలో తెలంగాణ దండోరా హైదరాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం, రమాబాయి జయంతి వేడుకల సందర్భంగా కేకు కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న సందర్భంగా స్థానిక పెద్దమనుషులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్ మాదిగ, స్టేట్ కోఆర్డినేటర్ మీసాల ఎల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ దండోరా 3 సంవత్సరాలు పూర్తి చేసుకోని, 4వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా, మాత రమాబాయి అంబేద్కర్ 128వ జయంతి సందర్భంగా, రాష్ట్ర ప్రజలందరికీ శు



భాకాంక్షలు తెలిపారు. మూడు దశాబ్దాల కళా సహకారం అయినందుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ కో-చైర్మన్ దామోదర రాజనర్సింహకు, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పై సోమవారనాడు తుది తీర్పు ఉంది అని మాదిగ మాదిగ ఉపకులానికి 10% రిజర్వేషన్ రాబోతుందని చెప్పారు. గత 30 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దండోరా హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, తెలంగాణ దండోరా నాయకులు అనిల్, చందు, నరేష్, రాఘవేంద్ర, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలి షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్పా





శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతులయ్య (శుభోదయం న్యూస్) : విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్పా తెలిపారు. శుక్రవారం పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ ఎం జ్యోతిలత ఆధ్వర్యంలో సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షిరిడిసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్ప హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్పర్సన్ శిల్ప మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకొని కన్న తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు,పుట్టిన సొంత ఊరికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులు ఎవరెవరు ఏ ఏ లక్ష్యాలను నిర్దేశించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. హెచ్ ఎం జ్యోతిలత మాట్లాడుతూ షిరిడిసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో అనేకమంది పేద విద్యార్థుల లక్ష్యసాధనకు ఆర్థిక సహకారం అందించి కార్పొరేట్ విద్య అందించిన ఘనత షిరిడిసాయి గ్లోబల్ ట్రస్ట్ కు దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్ర, హరికిరణ్ ,ఆరంజ్యోతి, ఎల్లప్ప, చంద్ర, పిటి హిమబిందు, షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ సిబ్బంది చిట్టిబాబు, హరి, విద్యార్థిని విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## 132కేవీ లైన్లు మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత.

పామూరు మండల రిపోర్టర్ బండి (రమేష్ శుభోదయం న్యూస్)పామూరు మండలంలోని వర్గం పల్లి గ్రామ సమీపంలో ఉన్న 132 కె.వి లైన్లు మరమ్మతులు కారణంగా ఈరోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఏఈ జిలాని తెలిపారు.

## కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మద్దిశెట్టి






ప్రకాశం జిల్లా బ్యూరో -చంద్ర (శుభోదయం న్యూస్ ):కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు ఫిబ్రవరి 8 సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిపి మహిళ నాయకురాలు మద్దిశెట్టి రమాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా నిలిచి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ వైద్యశాలలు, విద్యా, వైద్యం మౌలిక వసతుల కల్పనలో వేగంగా ముందుకు పోతూ ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ ఉగ్ర అభినందనీయుడని వారన్నారు. భవిష్యత్తులో డాక్టర్ ఉగ్ర మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు ఆమె తెలిపారు

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలిసిన ముల్లంగి రవీంద్రారెడ్డి.



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్ ): ఒంగోలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గారిని శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీ ముల్లంగి రవీంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రకాశం జిల్లాలోనివైసిపి పార్టీ పరిస్థితులు ఎలా ఉన్నాయి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఏం చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు.

## వరల్డ్ కప్ ఖో- ఖో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన శివారెడ్డిని అభినందించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్ ): జనవరి 13 నుంచి 19 వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మొట్టమొదటి వరల్డ్ కప్ ఖో- ఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం ఈదర గ్రామం కు చెందిన పోతిరెడ్డి శివారెడ్డి భారత ఖో- ఖో జట్టుకు ప్రాతినిధ్యం వహించి మంచి క్రీడా ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు మన కనిగిరి శాసనసభ్యులు మరియు రాష్ట్ర ఖో- ఖో సంఘం చీఫ్ పాట్రన్ శ్రీ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఖో- ఖో సంఘం కార్యదర్శి శ్రీ ఎం. సీతారామ రెడ్డి గారు, అధ్యక్షులు శ్రీ టి.ఎస్.ఆర్. కే. ప్రసాద్ గారు మాట్లాడుతూ2023 గోవాలో జరిగినటువంటి 37వ జాతీయ క్రీడల్లో మన రాష్ట్ర పురుషుల ఖో- ఖో జట్టు కాంస్య పథకం సాధించడం జరిగింది. ఈ పథకం సాధించినప్పుడు అప్పటి ప్రభుత్వం ఒక్కొక్క క్రీడాకారుడుకు మూడు లక్షల చొప్పున నజరానా ప్రకటించడం జరిగింది తప్ప అది కార్యరూపం దాల్చలేదు....ఎన్డీఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఈ విషయం తెలుసుకున్న శ్యాప్ చైర్మన్ శ్రీ రవి నాయుడు గారు చొరవ తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ముఖ్య మంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మరియు విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ బాబు గారు మరియు శ్రీ ఎం. రాంప్రసాద్ రెడ్డి గారు క్రీడా శాఖ మంత్రివర్యులు వెంటనే స్పందించి క్రీడాకారులకు రావాల్సిన నజరానాను ఈరోజు వారి యొక్క అకౌంట్లోకి నేరుగా జమ చేయడం జరిగింది ... ఈ సందర్భంగా రాష్ట్ర ఖో- ఖో సంఘం తరపున ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు... ఈ కార్యక్రమంలో జిల్లా ఖో- ఖో సంఘం కార్యదర్శి శ్రీ బి. కాశీ విశ్వనాథరెడ్డి గారు మరియు ఏషియన్ ఖో- ఖో గోల్డ్ మెడల్ క్రీడాకారుడు శివనాగిరెడ్డి పాల్గొన్నారు..

## ఐఏఎస్ విద్యాసాగర్ చేతుల మీదుగా ఆనంద్ నవమణి చారిటబుల్ ట్రస్ట్ షీల్డ్ ను అందుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు జెపి రాజు మాదిగ.





కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్ ):సిఎస్ పురం మండలం అరివేముల గ్రామంలో అంగలకుర్తి ఆనంద్ నవమణి 22వ సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా ఐఏఎస్ గంధం చంద్రుడు గారు మాజీ ఐపీఎస్ విద్యాసాగర్ రిటైర్డ్ ఐఏఎస్ తోల్లేటి ప్రభాకర్ వీరు పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు ఆ కార్యక్రమంలో భాగంగా కనిగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జ్ జెపి రాజు మాదిగ గారికి ఆనంద నవమణి చారిటబుల్ ట్రస్ట్ తరఫున షీల్డ్ ను బహుకరించడం జరిగినది జేపీ రాజ్ మాదిగ మాట్లాడుతూ నన్ను ప్రోత్సహించి ఈ షీల్డ్ ను నాకు బహుకరించినందుకు మరియు ఉద్యమంలో విద్యాసాగర్ గారు పలు సూచనలు ఇస్తూ ఉద్యమానికి తన వంతు సహాయ సహకారాలు అందించటం ఈ విధంగా ప్రోత్సహించినందుకు వారికి వారి కుటుంబ సభ్యులందరికీ గౌరవనీయులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ తరపున సామాజిక ఉద్యమ నమస్కారాలు తెలియజేసుకోవడం జరిగినది ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వర్ల దేవదాస్ మాదిగ ఈ కనిగిరి ఎంఈఎఫ్ నాయకులు గూడూరు కరుణాకర్ సంగటి ఏబు అంగలకుర్తి ఇమ్మానియేల్ సంఘటి సుధాకర్ అంగల్గుర్తి సురేష్ బాబు భారీ సంఖ్యలో స్కూల్ పిల్లలు మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఈనెల 9న ఒంగోల్లో క్యాన్సర్ డ్రగ్ నియంత్రణపై ర్యాలీ బహిరంగ సభ!

### రైజ్ కృష్ణ సాయి గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ టేక్ బుల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమం.




టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఈనెల 9న ఒంగోలులో క్యాన్సర్ మరియు డ్రగ్స్ నియంత్రణపై 5కె మర్థాన్ రన్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మండల పరిధిలోని వల్లూరు రైస్ కృష్ణ సాయి ఇన్స్టిట్యూట్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కరస్పాండెంట్ సిద్ధ హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ డ్రగ్స్ నియంత్రణపై యువతకు అవగాహన కల్పించే విధానంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమం టేక్ బుల్ సంస్థతో తాము సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 9 (ఆదివారం) ఉదయం 6 గంటలకు ఒంగోలు మిని స్టేడియంలో ర్యాలీ ప్రారంభించి తదనంతరం అదే ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రజలను కోరడం జరిగింది. ఈ సమావేశంలో టెక్ బుల్ సీఈఓ భాస్కర్ రెడ్డి రైస్ కృష్ణ సాయి గ్రూప్స్ అడ్వైజర్ శ్రీమతి సిద్ధ ప్రవల్లిక తదితరులు ఈ మీడియా సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఇదిలా ఉండగా జిల్లా అధికారులు ప్రముఖ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు సిద్ధ హనుమంతరావు పేర్కొనడం జరిగింది.

## 6వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025 లో సత్త చాటిన తెలంగాణ ఆడబిడ్డ



(శుభోదయం న్యూస్):ఇటీవల కేరళ రాష్ట్రం, త్రిసూర్ జిల్లా, కున్నంకులం లో జరిగిన 6వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025 లో సత్త చాటిన తెలంగాణ ఆడబిడ్డ శ్రీమతి ఎమ్ భవాని , 50 మరియు ఎక్కువ వయస్సు వున్నవారికి జరిగిన 5కె మీటర్ల రన్ ఈవెంట్‌లో రజత పతకం (2వ స్థానం) మరియు 10కె మీటర్ల పరుగు పందంలో కాంస్య పతకం (3వ స్థానం) సాధించారు. శ్రీమతి ఎమ్ భవాని , హైదరాబాద్ లో ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ లో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులకు మరియు ప్రోత్సహం ఇస్తున్న కళాశాల యాజమాన్యం మరియు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి వి నరసింహులు గారికి , వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ కృష్ణవేణి , ప్రొఫెసర్ పి వి రవీంద్ర రెడ్డి గార్కి, ఎఈసి సిఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ పబ్బోజు గార్కి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలో జరిగిన సన్మాన సభలో సిబ్బంది శుభాకంక్షాలు తెలిపారు.

## ఎఐసిటిఈ ఐడియా ల్యాబ్ ను సందర్శించిన ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



(శుభోదయం న్యూస్):చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కి చెందిన ఎఐసిటిఈ ఐడియా ల్యాబ్ ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరియు అధ్యాపకుల కోసం ఒక రోజు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. పాఠశాల విద్యార్థులలో సృజనాత్మకత మరియు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బివిఎస్ రావు, డైరెక్టర్ ఐ అండ్ ఐ డాక్టర్ యుకె చౌదరి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఆవిష్కరణలు, సృజనాత్మక ఆలోచనలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఎఐసిటిఈ ఐడియా ల్యాబ్, సిబిఐటి లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రదర్శించడం మరియు అత్యాధునిక సాంకేతికతలతో ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఎఐసిటిఈ ఐడియా ల్యాబ్‌లో 3డి ప్రింటింగ్, డ్రోన్‌లు మరియు పిసిబి మెషీన్‌లతో సహా పలు సౌకర్యాలను విద్యార్థులకు పరిచయం చేశారు. ఇంటరాక్టివ్ సెషన్‌లు మరియు ప్రదర్శనలు విద్యార్థులకు ఈ సాంకేతికతల యొక్క ఆచరణాత్మక అనువర్తనాలు మరియు ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో సహాయపడింది. మరియు అధ్యాపకులు విద్యార్థులతో పాటు, కార్యక్రమం అంతటా మార్గదర్శకత్వం మరియు మద్దతును అందించారు. ఈ సందర్భంగా సిబిఐటి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి వి నరసింహులు మాట్లాడుతూ సాంకేతికతను ముందస్తుగా బహిర్గతం చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు మరియు పాఠశాల విద్యార్థులను వినూత్న మరియు ఆచరణాత్మక అభ్యాస అనుభవాలను అన్వేషించేలా ప్రోత్సహించడానికి సిబిఐటి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## ఏకలవ్య భూదాతల పొట్ట కొట్టిన ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు... నడిరోడ్డున పడ్డ భూదాతల కుటుంబాలు.. కాంగ్రెస్ పార్టీ అరకు ఇన్చార్జి శెట్టి. గంగాధర్ స్వామి...

డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు దానం చేసిన భూదాతలను రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వారి పొట్ట కొట్టడం తో వారి కుటుంబకులు ఎటువంటి ఆదాయం లేక నడిరోడ్డున పడ్డారని కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి శెట్టి. గంగాధర్ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణం చేపట్టిన ఆవరణలో శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని నిరసిస్తూ భూదాతలు చేపట్టిన 15వ నిరాహార దీక్షలో ఆయన పాల్గొని పూర్తిగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి అధికారులు భూదాతలకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీలు ఇచ్చి సుమారు 6 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కూడా ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించకపోవడం సరికాదన్నారు. వారు వ్యవసాయం చేసే భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ప్రభుత్వ అధికారులు హామీలిచ్చి హామీలను మాయం చేయడం విచారకరమన్నారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు దానం చేసి ఆరు సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత లేక, అటు వ్యవసాయం లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతూ వారి వారి కుటుంబీకులు పూటకు కూడా గతి లేని పరిస్థితి ఏర్పడి నడిరోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు కేవలం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామంటూ మాయమాటలు చెప్పి, భూములను లాక్కొని ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించకపోవడం సరికాదన్నారు. గిరిజనుల బతుకులతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులను భవిష్యత్తులో సరైన గుణపాఠం చెప్పక తప్పదని ఆయన చెప్పారు. ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు దానం చేసిన భూదాతలకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి వారికి శాశ్వత ఉద్యోగ భద్రతలు కల్పించి నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వాల కార్యాలయాల్లో తీవ్ర ఆందోళన చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, పలు సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిమ జాతి గిరిజనులకు నిత్యవసరకులు పంపిణీ..కృష్ణకుమారి..

డుంబ్రిగుడ ): మండలంలోని కుక్కడబెడ్డ గ్రామ ఆదిమ జాతి గిరిజనులకు మానవహక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె. కృష్ణకుమారి శుక్రవారం నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని, పరిసరాల పరిశుభ్రంగా నిత్యం ఉంచుకొని ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. గ్రామం లో ఎటువంటి జబ్బు జ్వరాలు వచ్చిన తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆశ్రయించి మందు మాకులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయుల హక్కుల్ని కాపాడడంలో కేంద్రం విఫలమైంది



న్యూఢిల్లీ : అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న భారతీయుల్ని స్వదేశానికి పంపిన తీరు అమానవీయంగా ఉంది. ఈ ఘటనపై ప్రతిపక్ష ఎంపీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. తాజాగా ఈ ఘటనపై శివసేన (యుబిటి) నేత మోడీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'భారతీయులేమీ నేరస్తులు కాదు. వారి చేతులకు, కాళ్లకు సంకెళ్ల వేయడానికి. ఆ సంకెళ్లను తొలగించాల్సింది. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే. అసలు అమెరికా విమానాన్ని టేకాఫ్ చేయడానికి అనుమతించకుండా.. తిరిగి వెనక్కి పంపాల్సింది' అని ఆయన అన్నారు. అమెరికా భారతీయుల్ని వెనక్కి పంపినప్పటికీ.. వారి హక్కులను పరిరక్షించడంలో భారత ప్రభుత్వం విఫలమైంది. దీనిపై ప్రభుత్వం బలమైన వైఖరి తీసుకోవాల్సింది అని ఆయన నొక్కి చెప్పారు.

## కల్తీ ఆహార ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ



తెలంగాణ : కల్తీ ఆహార ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. ఈమేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గురుకులాల్లో వందల సంఖ్యలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరిగాయన్నారు. కల్తీ ఆహారం పెడితే అరెస్టు చేస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించిన సంగతిని గుర్తుచేశారు. ఆయన హెచ్చరించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ఎద్దేవా చేశారు. " రేవంత్ రెడ్డి మీ మాటలు ఆచరణలో జరగలేదనడానికి గురుకులాల దీనస్థితే నిదర్శనం. ఆహార కల్తీ ఘటనల్లో వందలమంది విద్యార్థులు ఆసుపత్రుల పాలుకాగా, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి. ఫుడ్ పాయిజన్ కేసులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం " అని హరీష్ రావు పేర్కొన్నారు.

## ఐదునెలల్లో 39 లక్షల మంది ఓటర్లను ఎలా చేర్చారు



ముంబయి : మహారాష్ట్రలో ఐదు నెలల్లో 39 లక్షల మందిని ఓటర్ల జాబితాలో ఎలా చేర్చారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘం (ఈసి)ని నిలదీశారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కొత్త ఓటర్లు నమోదుపై ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్, ఎన్‌సిపి-ఎస్‌సిపి ఎంపి సుప్రియాసూలే సహా ఇండియా బ్లాక్ నేతలు శుక్రవారం సంయుక్తంగా మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లుచేరారని అన్నారు. మహారాష్ట్ర ఎన్నికలలో జరిగిన అవతవకలపై ఈసి సమాధానమివ్వాలని, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసి ఓటర్ల జాబితాలను సమర్పించకపోవడంతో ఎన్నికల్లో అవతవకలు జరిగాయని స్పష్టమౌతోందని అన్నారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని, కానీ తాము రాజ్యాంగాన్ని రక్షించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో అవకతవకలపై కోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. ఈసి నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్లయితే, రాహుల్‌గాంధీ ప్రశ్నలకు సమాధానమివ్వాలని శివసేన (యుబిటి) నేత సంజరు రౌత్ పేర్కొన్నారు. లేకుంటే ప్రభుత్వానికి ఈసి బానిసగా భావించాల్సి వుంటుందని అన్నారు.ు

## ఢిల్లీలోని పలు స్కూళ్లకు బాంబు బెదిరింపులు



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని పలు పాఠశాలలకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. శుక్రవారం ఉదయం ఈస్ట్ ఢిల్లీ, నోయిడాలోని పలు స్కూళ్లకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాంబు స్క్వాడ్ సిబ్బంది స్కూళ్లలో తనిఖీలు చేశారు. మయూర్ విహార్‌లోని అహ్లోకాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు, నోయిడాలోని శివ్ నాడార్ స్కూల్‌కు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆ స్కూళ్లలో అనుమానాస్పద వస్తువులేవీ లేవని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. బెదిరింపులకు సంబంధించి మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయమై సైబర్ టీమ్ దర్యాప్తు చేస్తున్నదని, ప్రజలు ఇలాంటి వార్తలను నమ్మొద్దని నోయిడా పోలీసులు సూచించారు. కాగా, ఢిల్లీలో గతంలో కూడా పలుమార్లు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే.

## 'ప్రజాదరణ కల్గిన నేత కాబట్టే టార్గెట్ చేసి విషం చిమ్ముతున్నారు'

తిరుపతి వైఎస్సార్‌సీపీలో కీలక నాయకుడిగా ఉన్న పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై ఈనాడు పత్రిక పనిగట్టుకుని విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పడి ఏడ్వటం ఈనాడుకు అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. డి.పట్టాభూములు,ఫ్రీహోల్డ్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ తప్పుడు కథనాలు రాయడం ఈనాడు పత్రిక పనిగా పెట్టుకుందన్నారు. ఏడు నెలల క్రితం మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తగలబెట్టారు అంటూ ప్రచురించిన ఈనాడు.. ఇప్పుడు తప్పుడు కథనాలు ప్రచురిస్తూ విషం చిమ్ముతున్నారన్నారు. పచ్చి అబద్ధాలతో కూడిన వార్తలు రాస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు బాకా ఊదడం కోసమే పార్టీ పత్రికగా ఈనాడు మిగిలిపోయిందని భూమన విమర్శించారు. 'ఈ కేసు విషయంలో డీజీపీని మదనపల్లెకు పంపించి మరీ విచారణ జరిపించారు. నివేదిక ఇచ్చారు. ఈనాడు మళ్లీ బురద చల్లడానికే ఈ వార్తలు ప్రచురిస్తున్నారు. ఫైల్స్ దహనం కేసులో ఏ సంబంధం లేకపోయినా పనికట్టుకుని ఇరికించాలని చూస్తోంది. ప్రజాధరణ కల్గిన నాయకుడు కనుక ఆయన్ని బద్నాం చేయాలని చూస్తోంది. వైఎస్సార్‌సీపీ ని బలహీన పర్చాలని కుట్రలు చేస్తున్నారు.ఆయన ఏ తప్పు చేయలేదని ప్రజలు అందరికీ తెలుసు. ఎన్ని విచారణలు చేసినా, చేయించినా ఏ తప్పు చేయలేదన్నదే తేలుతుంది' అని భూమన స్పష్టం చేశారు.

# అమెరికా అమానుషత్వం



సహజ వనరులు పుష్కలంగా ఉన్న దేశాలపై కన్నేసి వాటిని నయానో భయానో ఒప్పించి అక్కడి ప్రాంతాలను దురాక్రమించాలని చూస్తున్న అమెరికా... పొట్టకూటి కోసం తనను ఆశ్రయించినవారి పట్ల మాత్రం అమానుషంగా, హేయంగా ప్రవర్తిస్తున్నదని రుజువైంది. సైనిక విమానంలో అమృత్ సర్ చేరుకున్నవారి కథనాలు వింటుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి, కూర్చోవటానికి కూడా అసౌకర్యంగా ఉండే సైనిక విమానంలో పశువుల్ని తరలించిన చందాన మనవారిని తీసుకొచ్చారు. ఇందులో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు కూడా ఉన్నారని మీడియా కథనాలు చెబుతున్నాయి. గత నెలలో కొలంబియా, మెక్సికో దేశాలవారిని ఈ పద్ధతిలోనే పంపటానికి ప్రయత్నించినప్పుడు వాటినుంచి నిరసన వ్యక్తమైంది. అమెరికా సైనిక విమానాలకు అనుమతినీయబోమన్నాయి. చివరకు కొలంబియా తలొగ్గినా మెక్సికో మాత్రం తమ విమానాన్ని పంపి వలసదారులను వెనక్కు తెచ్చుకుంది. బ్రెజిల్ సైతం తమవారిపట్ల అమానుషంగా వ్యవహరించటాన్ని ఖండించింది. భారతీయులకు జరిగిన అవమానంపై సహజంగానే పార్లమెంటులో గురువారం ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారిని గుర్తించి వెనక్కు పంపటం ఏ దేశంలోనైనా జరిగేదే. పార్లమెంటులో విదేశాంగమంత్రి జైశంకర్ చెప్పినట్టు అక్రమ వలసదారులను వెళ్లగొట్టడం కొత్తేమీ కాదు. ఏ దేశమూ అలాంటివారిని సమర్థించదు. అక్రమ వలసల్ని ప్రోత్సహించదు. కానీ వెనక్కు పంపే క్రమం మానవీయంగా, నాగరికంగా ఉండాలి. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలి. చట్టబద్ధంగానో, చట్టవిరుద్ధంగానో తమ భాష, తమ ప్రాంతం కానివారు ప్రవేశిస్తే సహజంగానే స్థానికుల్లో అనేక సంశయాలు కలుగుతాయి. తెలియని భయాందోళనలుంటాయి. ప్రభుత్వాలకుండే ఇతరేతర అనుమానాలు సరేసరి. అమెరికాలో రిపబ్లికన్‌ల ఏలుబడివున్నా, డెమాక్రాట్ల ప్రభుత్వం నడిచినా అక్రమ వలసదారులను కనికరించింది లేదు. కాకపోతే ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో దాన్నొక బూచిగా చూపారు. శ్వేతజాతీయులు ఎదుర్కొంటున్న సకల సమస్యలకూ మూలం వలసదారులేనన్న భ్రమ కలగజేయటంలో, వారికి డెమాక్రటిక్ పార్టీ మద్దతునిస్తున్నదని నమ్మించడంలో విజయం సాధించారు. తాను అధికారంలోకొచ్చాక అలాంటి వారందరినీ గుర్తించి పంపేస్తానని పదే పదే చెప్పారు. ఆ ప్రచారం ఆయనకు గణనీయంగా వోట్లు రాల్చింది. కానీ తమది ప్రపంచంలోనే పురాతన ప్రజా స్వామ్య వ్యవస్థ అని స్వోత్కర్షకు పోయే దేశం వలసదారులను పశువులకన్నా హీనంగా పరిగణించటం, వారి కనీస మానవహక్కులను బేఖాతరు చేయటం సబబేనా? వలసదారులు తిరుగుబాటు చేయడానికి రాలేదు. వారి దగ్గర మారణాయుధాలుండవు. ఏజెంట్లను నమ్మి, వారికి లక్షలకు లక్షలు అర్పించుకుని నిజంగా అమెరికా చాన్సు వచ్చిందేమోనన్న భ్రమలో కొందరు నిర్భాగ్యులు విమానం ఎక్కుతారు. వారిని ఇటలీ, బ్రెజిల్, మెక్సికో, పెరూవంటి దేశాల్లో దించి 'మీ చావు మీరు చావండ'ని గాలికొదిలేస్తారు. తమ దగ్గరున్న కాగితాలు నిజమైన వేనన్న భ్రమలో ఉన్న వలసదారులకు అప్పుడిక ఏం చేయాలో పాలుపోదు. చివరకు దేవుడిపై భారంవేసి ముందుకు పోవటానికే నిర్ణయించుకుని కొండలూ, గుట్టలూ, నదులూ దాటుకుంటూ తిండీతిప్పలూ లేక నీరసించి అమెరికా సరిహద్దులకు చేరుకుంటారు. అదృష్టం ఉంటే అక్కడి భద్రతా బలగాల కళ్లుగప్పి ఆ దేశంలోకి ప్రవేశిస్తారు. లేదా దొరికిపోయి జైళ్లపాలవుతారు. భ్రమ లన్నీ అడుగంటి, అక్కడ ఉండలేక, వెనక్కొచ్చే దారి దొరక్క జైళ్లలో మగ్గుతారు. సవ్యంగా పంపితే 'బతుకు జీవుడా' అనుకుంటూ అక్కడినుంచి నిష్క్రమించటానికే అత్యధికులు సిద్ధంగా ఉంటారు. అలాంటివారిపైనా ట్రంప్ ప్రతాపం! అప్పుడెప్పుడో వియత్నాం మొదలుకొని వర్తమానంలో గాజా వరకూ అమెరికా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేర్వేరు దేశాల్లో సాగించిన అకృత్యాల మాటేమిటి? వాటికి పడాల్సిన శిక్షేమిటి? ఏనాడైనా ఆత్మసమీక్ష చేసుకుందా? ఎడ్వర్డ్ స్నోడెన్, చెల్సియా మానింగ్ వంటివారు బట్టబయలు చేసిన రహస్య పత్రాలను ఒకసారి అమెరికా చదువుకుంటే మంచిది. అక్రమ వలసదారులను సమర్థించాలని ఎవరూ చెప్పరు. కానీ అమెరికా వ్యవహరించిన తీరును మన ప్రభుత్వం ఖండించాల్సిన అవసరం లేదా? గతంలో యూపీఏ హయాంలో అమెరి కాలో మన దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగడేపై వచ్చిన ఆరోపణలు ఆసరా చేసుకుని ఆమెకు సంకెళ్లు వేసి, వివస్త్రను చేసి తనిఖీ చేసినప్పుడు మన ప్రభుత్వం అప్పటి అమెరికా రాయబారి నాన్సీ పావెల్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. భారత్‌లో పర్యటిస్తున్న అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల్ని కలుసుకునేందుకు మన నాయకులు నిరాకరించారు. అమెరికా దౌత్య కార్యాలయ సిబ్బందికిచ్చే అనేక రాయితీలనూ, సౌకర్యాలనూ ఉపసంహరించారు. దౌత్యరంగంలో రెండు దేశాల మధ్యా విడ దీయరాని అనుబంధం ఉండి వుండొచ్చు. అది మనకు మిత్ర దేశమే కావొచ్చు. వలస దారులను సవ్యంగా పంపి వుంటే సమస్యే ఉత్పన్నమయ్యేది కాదు. కానీ జరిగింది అందుకు భిన్నం. ఈ విషయమై పార్లమెంటులో వ్యక్తమైన అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. తప్పును తప్పని చెప్పితీరాలి. వలసదారుల విషయంలో ఎలా వ్యవహరించాలో చెప్పే అంతర్జాతీయ ఒడంబడిక లున్నాయి. అగ్రరాజ్యమైనంత మాత్రాన వాటిని బేఖాతరు చేస్తానంటే కుదరదు. ముమ్ముందు ఇలాంటి ఉదంతాలు చోటుచేసుకోకూడదనుకుంటే మన నిరసనను తెలియజేయటమే ఉత్తమం.

# వాణిజ్య యుద్ధం.. ఎవరికి లాభం?



కెనడా, మెక్సికో, చైనానుంచి అమెరికాకు దిగుమతయ్యే అన్ని రకాల వస్తువులపై సుంకాలు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ద్వారా కొత్త రకం వాణిజ్య యుద్ధానికి అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ తెరతీశారు. ఇప్పటికి సుంకాల పెంపు ఈ మూడు దేశాలకే పరిమితమైనా, రాగల కాలంలో భారత్‌తోపాటు మరికొన్ని దేశాలకూ వర్తింపజేసే ప్రమాదం కనబడుతోంది. అధ్యక్షపదవిలోకి వచ్చీరాగానే కొలంబియాపై సుంకాల మోత మోగించిన ట్రంప్, ఆ తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు చిరకాలంగా తమతో వాణిజ్య భాగస్వాములుగా కొనసాగుతున్న మెక్సికో అండ్ కో పై ముందూవెనకా ఆలోచించకుండా సుంకాలు విధించడంతో అమెరికా వాణిజ్య విధానం విమర్శలకు గురవుతోంది. సుంకాల విధింపునకు ట్రంప్ చెబుతున్న కారణాలు వాణిజ్యానికి సంబంధం లేనివే కావడం గమనార్హం. కెనడా, మెక్సికో దేశాలు అక్రమ వలసలను అరికట్టటం లేదని, నిషేధిత ఫెంటానిల్ మాదకద్రవ్యం అమెరికాలోకి అక్రమంగా తరలిస్తున్న ముఠాలకు చైనా ముకుతాడు వేయడం లేదన్నవి ట్రంప్ చెబుతున్న కారణాలు. కెనడా, మెక్సికోలు అమెరికాకు దీర్ఘకాలిక మిత్రదేశాలు మాత్రమే కాదు, అమెరికాకు జరిగే ఎగుమతుల్లో చైనా తర్వాత ఈ రెండింటిదే సింహభాగం. ఈ దేశాలనుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం చొప్పున సుంకాలు విధించిన ట్రంప్, చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాలు వడ్డించారు. పైగా, సుంకాల విధింపునకు జాతీయ ఆర్థిక అత్యయిక స్థితిని విధించడం గమనార్హం. అమెరికాకు అక్రమంగా వలస వచ్చినవారి వల్ల స్వదేశీయుల ప్రయోజనాలు దెబ్బతింటున్న మాట వాస్తవం. అలాగే చైనానుంచి అక్రమ మార్గంలో వస్తున్న ఫెంటానిల్ కారణంగా అమెరికన్ యువత ప్రాణాలమీదకు తెచ్చుకుంటోందన్న ఆయన ఆక్రోశం కూడా అర్థం చేసుకోదగినదే. అయితే, చర్చల ద్వారా పరిష్కరించుకుంటే సమసిపోయే ఈ సమస్యలను భూతద్దంలోంచి చూడటమే ట్రంప్ చేస్తున్న పొరబాటు. తాను అధికారంలోకి వచ్చాక నిత్యావసర ధరలు, వాహనాలు, చమురు ధరలను భూమార్గం పట్టిస్తానంటూ నమ్మబలికిన ట్రంప్, ఇప్పుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తూండటమే విచిత్రం. సుంకాల పెంపువల్ల అక్రమ వలసలు ఏమాత్రం తగ్గుతాయో, ఫెంటానిల్ అక్రమ రవాణాకు ఏమేరకు ముకుతాడు పడుతుందో తెలియదుగానీ, ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్య యుద్ధం వికటిస్తే, ధరలు భారీగా పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రమాదం లేకపోలేదు. ట్రంప్ నిర్ణయం వల్ల ప్రస్తుతం 2.9 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం మరో 0.4 శాతం పెరిగే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికన్లను రక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతూనే, వారు కొంత ఇబ్బంది పడే అవకాశాలు లేకపోలేదని అగ్రరాజ్యాధినేత స్వయంగా అంగీకరించడం గమనార్హం. తమ దేశం అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధమనే ధీమాతో ఆయన ఉన్నట్లుగా కనబడుతోంది. కానీ, పేరుకు అగ్రరాజ్యమే అయినా చమురు సహా పలు ఉత్పత్తుల కోసం అగ్రరాజ్యం అనేక దేశాలపై ఆధారపడుతోందన్నది తోసిపుచ్చలేని నిజం. చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవడం ప్రజాస్వామిక దేశాలు అనుసరించే ప్రాథమిక సూత్రం. అయితే డొనాల్డ్ ట్రంప్‌కు చర్చలపై అంతగా నమ్మకం ఉన్నట్లు కనబడదు. దూకుడుగా ప్రవర్తించడం. బెదిరింపుల ద్వారా, ఆంక్షలు విధించి కట్టడి చేయడంద్వారా ఎదుటివారిని దారికి తెచ్చుకోవాలన్నది ఆయన సిద్ధాంతం. తాను అధికారంలోకి రాకముందే యుద్ధానికి ముగింపు పలకాలంటూ ఇజ్రాయెల్, హమాస్‌లను హెచ్చరించడాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సుంకాల పెంపుపై ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేస్తామని చైనా హెచ్చరించింది. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థనే ఖాతరు చేయని ట్రంప్, డబ్ల్యుటిఒ ఆదేశాలను శిరోధార్యంగా భావిస్తారని అనుకోలేం. ఈ సందర్భంగా మిన్నెసోటా గవర్నర్ అమీ క్లోబుచర్ అన్న మాటలు ప్రస్తావనార్హం. 'ట్రంప్ వచ్చాక గందరగోళం పెరిగింది. అవినీతి పెరిగింది. కోడిగుడ్ల ధరలు సైతం పెరిగాయి. ఇప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కావలసింది ఇది కాదు. ఉలిని వాడటానికి బదులు ఆయన పెద్ద సుత్తిని వాడుతున్నారు' అంటూ చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేకపోలేదు. గోటితో పోయేదానికి ట్రంప్ గొడ్డలి వరకూ తీసుకువెళ్తున్నారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలు విధిస్తోందంటూ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ కొన్ని ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం ద్వారా నష్టనివారణ చర్యలు చేపట్టింది. వచ్చే నెలలో అమెరికాలో పర్యటించనున్న ప్రధాని మోడీ.. ట్రంప్‌తో జరిపే ద్వైపాక్షిక చర్చలలో సుంకాల పెంపు సమస్యతోపాటు అగ్రరాజ్యంతో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందడుగు వేయాలి.

# పంట భూముల్లోకి పరిశ్రమలు వస్తే..



పాలనా పగ్గాలు చేపట్టగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 2024లో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో మొదటిసారిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా రాష్ట్రానికి రూ. 40 వేల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. ఆగస్టు 2024లో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ. 36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం రూ. 76,232 కోట్ల మేర పెట్టుబడులను సాధించుకోగలిగింది. మరోసారి రాష్ట్రంలో విదేశీ పెట్టుబడుల యాత్రలో భాగంగా గత నెల ముఖ్యమంత్రి, తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో కలిసి సింగపూర్‌లో మూడు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఎఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్‌తో రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదిరింది. దాదాపు రూ. 450 కోట్లతో నగరంలో భారీ ఐటి పార్కు ఏర్పాటుకు క్యాపిటల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది. సింగపూర్ నుంచి సిఎం బృందం దావోస్ పర్యటన చేపట్టింది. దావోస్‌లో ఈ నెల 20 నుండి నాలుగు రోజులపాటు సాగే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బృందంతో పాల్గొన్నారు. 21వ తేదీన అక్కడి తెలంగాణ పెవిలియన్‌లో రూ. 15 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టుల కోసం ఒప్పందాలు కుదిరాయి. 22న ఒకే రోజు రూ. 56300 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. ఇందులో సన్ పెట్రో కెమికల్స్ అనే సంస్థ తెలంగాణలో రూ. 45 వేల కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. చివరి రోజైన 23 నాడు ఏకంగా రూ. 91500 కోట్ల పరిశ్రమ స్థాపనకు ఒప్పందాలు జరిగాయి. ఇవే కాకుండా మరెన్నో విదేశీ కంపెనీలతో కూడా ఆ వేదికగా ఒప్పందాలపై సంతకాలు అయ్యాయి. ఇలా దావోస్ వేదికపై ఈసారి మొత్తం రూ.179 వేల కోట్ల పెట్టుబడుల రాకకు దారి పడింది. అదే వేదికపై నుండి పెట్టుబడుల ఆకర్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ప్రమాణాల నగరంగా అభివృద్ధి చేస్తామని అంటున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో హైద్రాబాద్‌ను కాలుష్యరహితంగా నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దుతామంటున్నారు. నగరంలో మౌలిక సదుపాయాలు, నైపుణ్య మానవ వనరులు, అనువైన వాతావరణం అన్ని ఉన్నాయని పెట్టుబడిదారులకు హామీ ఇస్తున్నారు. ఇలా వేల కోట్ల పెట్టుబడుల, ముఖ్యమంత్రి హామీల వార్తలు పత్రికల్లో చూస్తుంటే హైదరాబాద్ ఎంత అభివృద్ధి చెందుతోంది అని ఆనందం పడాలా లేక ఈ పరిశ్రమలన్నీ నగరం చుట్టూ విస్తరించాక రాబోయే విపత్తులు గుర్తొచ్చి బెంగపడాలా అనే సందిగ్ధం మొదలైంది. నిజంగా రేవంత్ రెడ్డి అంటున్నట్లుగా తెలంగాణ అంత సిద్ధంగా ఉందా? హైదరాబాద్‌లో పరిశ్రమలు వస్తే తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందుతుందా? అసలు అభివృద్ధి అంటే ఏమిటి? అనే మౌలిక ప్రశ్నలకు సమాధానం కావాలి. ఈ పెట్టుబడుల ఒప్పందాల ద్వారా వచ్చే పరిశ్రమల స్థాపనకు ప్రధానంగా తెలంగాణ నేలపై వేల ఎకరాల స్థలం కావాలి. ప్రభుత్వం దగ్గర అంత భూమి ఉన్నదా?.. మరో ప్రధాన సమస్య కాలుష్యం. పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యం వల్ల చుట్టూ ఉన్న గ్రామాలు, పంట భూములకు రక్షణ ఎవరు కల్పిస్తారు?. రెండు నెలల క్రితం హైదరాబాద్ కు 130 కి.మీ. దూరంలో ఉన్న లగచర్ల అనే గ్రామం ఫార్మా విలేజీకి మా భూములు ఇచ్చేదిలేదని అధికారులకు ఎదురు తిరిగి వార్తల్లోకి ఎక్కింది. ఆ ప్రతిపాదనను రద్దు చేసిన ప్రభుత్వం మందుల కంపనీ కాదు వేరేవి పెడతామని భూసేకరణ కోసం కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. దేనికీ భూములు ఇవ్వమని ఆ గ్రామస్థులు కరాఖండిగా చెప్పేస్తున్నారు. వద్దంటున్నా ఆగకుండా ఇంత తొందరగా మరో ప్రకటన ఇచ్చి ప్రభుత్వం ఎందుకు తొందర పడుతుందో అర్థం కాదు. ప్రజల అంగీకారం లేకుండా భూసేకరణ చట్టబద్ధం కాదు. భూసేకరణ కోసం గ్రామసభలో తీర్మానం కావాలి, అందులో 80% యజమానుల అంగీకారం ఉండాలని చట్టంలో ఉంది. భూమికి బదులు భూమి లేదా తగిన నష్టపరిహారం, ఇంటి స్థలం, కంపెనీలో ఉద్యోగం అనే ఆశలు చూపినా వీటిలో ఏది సక్రమంగా అమలు కావడం లేదు. భూమికి మార్కెట్ ధర చెల్లించలేదని కోర్టుల చుట్టూ తిరుగుతున్న గ్రామీణులు ఎందరో ఉన్నారు. పదేళ్ల క్రితం సాగు ప్రాజెక్టుల కోసం చేసిన భూసేకరణ చిక్కులే ఇంకా తేలలేదు. ఈ నేపథ్యంలో కొత్త పెట్టుబడుల ఒప్పందాలతో ఎన్ని గ్రామాలు, ఎన్ని ఎకరాల భూములు మాయమవుతాయో తెలియదు. ఓ లెక్కా పత్రం లేకుండా ముఖ్యమంత్రి అక్కడ ఒప్పందాలపై సంతకాలు పెడుతుంటే ఇక్కడ భూములు వణుకుతున్నాయి. పంట భూములన్నీ పరిశ్రమలకు కట్టబెట్టి రైతు కుటుంబాలను రోడ్డున పడేయడం అభివృద్ధి కాదు. ఆ పరిశ్రమల్లో కుటుంబానికి ఒక ఉద్యోగం ఇచ్చినా.. అదేదో వాచ్‌మన్ లాంటిదే ఉంటుంది. ఎందుకంటే ఆ పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలు గలవాళ్ళు ఆ కుటుంబాల్లో ఉండరు. ప్రయివేట్ రంగానికి ఎప్పుడు తమ ప్రయోజనాలే ప్రధానం. ఎప్పుడూ ఇచ్చిన మాట నిలుపుకోదు. అనంతపురంలోని కియా కార్ల ఫ్యాక్టరీ భూములు కోల్పోయిన వారికి పనులీయకుండా ఇప్పటికీ తిప్పుకుంటున్న వార్తలు వస్తున్నాయి. మరి ముఖ్యంగా కంపెనీ ఉద్యోగాల విషయానికొస్తే ఉద్యోగ భద్రత అసలే ఉండదు. పని గంటలు వారిష్టమే. మన కార్మిక చట్టాలు, ఉద్యోగ సంఘాలు అక్కడ చెల్లవు. కంపెనీ ఉద్యోగం అనగానే సంబరపడేంత సీనేమీ అక్కడ లేదు. ఒకప్పుడు నగరం చుట్టూ పళ్ళతోటలు, కూరగాయల, పూలసాగు ఉండేది. ఇప్పుడు వందల కి.మీ. దూరం నుండి అవి నగరానికి వస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చుట్టూ ఉన్న ఎన్నో గ్రామాల వ్యవసాయ భూములు ఐటి పరిశ్రమలకు ధారాదత్తం అయ్యాయి. వాటి వల్ల గ్రామీణులకు దక్కింది కూలి బతుకే. ఆ రోజుల్లో లక్షలకే మురిసిపోయి కోల్పోయినవారి భూములు ఇప్పుడు కోట్ల ధరలు పలుకుతున్నాయి. గ్రామీణులు రెంటికీ చెడ్డారు. అందుకోసం పారిశ్రామిక అభివృద్ధి ఏ మేరకు జరగాలి, సాగు భూముల పరిస్థితి ఏమిటి, ఈ ఒప్పందాల వల్ల సామాన్యుడికి ఒరిగేదేమిటి అనే అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి.